


TELANGANA SHASANA SABHA

TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 139 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | శుక్రవారం 25 అక్టోబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కేబినెట్ సబ్‌కమిటీ

# ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక హామీ



- ఉద్యోగ సంఘాల నేతలకు కీలక హామీ
- ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉద్యోగ సంఘాల నేతలతో చర్చ
- తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టీజీవో) ఉద్యోగుల జేఏసీ సమస్యల పరిష్కారంపై హామీ
- ఉద్యోగుల సమస్యలు కూడా తనకు తెలుసని సీఎం చెప్పారన్నారు.

**శాసనసభ / హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యలను పట్టించుకోవడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో తాజాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఉద్యోగ సంఘాల నేతలకు కీలక హామీ ఇచ్చినట్లు తెలిసింది. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిగాయి. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టీజీవో) ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారంపై హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని..

మిగతా »»2లో

# ఈ లైన్ తో అన్ని

## రాజధానులకు అమరావతితో అనుసంధానం ఏర్పడుతుంది.

- అమరావతి కనెక్టివిటీం ప్రాజెక్టుకు కేంద్రం ఓకే
- 57 కిలోమీటర్ల మేర నూతన రైల్వే లైన్
- రూ.2,245 కోట్ల వ్యయం కేటాయింపు
- ఈ ప్రాజెక్టు నాలుగేళ్లలో పూర్తవుతుందన్న సీఎం చంద్రబాబు
- కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని కేంద్రానికి విజ్ఞప్తి



2

**అమరావతి / శాసనసభ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీ రాజధాని అమరావతికి మళ్లీ మహర్దశ పట్టింది. తాజాగా, అమరావతి రైల్వేలైన్ కు కేంద్ర క్యాబినెట్ నేడు ఆమోదం తెలిపింది. ఈ కనెక్టివిటీ ప్రాజెక్టులో భాగంగా 57 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్ నిర్మాణం చేపట్టనున్నారు.

# ప్రజలు,రైతుల కోసం జైలుకు పోవడానికి రెడీ..

## కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**శాసనసభ / హైదరాబాద్ :** ఈ రాష్ట్ర ప్రజలు, రైతుల సంక్షేమం కోసం జైలుకు పోవడానికి కూడా రెడీగా ఉన్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నేతలను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన రైతన్నల ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ నుంచి ఉదయం ఏడున్నరకు వెళ్లినం.. కానీ కాంగ్రెస్ పాలన ఎట్ల ఉందంటే.. అన్ని పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మేడ్చల్ వద్దనే 45 నిమిషాలు పట్టింది. ఇక డిచ్‌పల్లి వద్ద కొందరు మహిళలు రోడ్డుకు అడ్డంగా కూర్చుని ధర్నా చేస్తున్నారు. ఏం కష్టమొచ్చింది అని దిగాను. వాళ్లు పోలీసోళ్ల భార్యలు. వన్ పోలీసింగ్ కావాలని డిచ్‌పల్లి బెటాలియన్ వద్ద ధర్నా చేస్తున్నారు. ధర్నా చేస్తున్న మమ్మల్ని రక్తం కారేలా గుంజుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆ ఆడబిడ్డలు.




అఖరికి కాంగ్రెస్ పాలనలో పోలీసోళ్ల భార్యలు ధర్నాలు చేసే పరిస్థితి.. వారు కూడా పోలీసోళ్ల చేతిలో దెబ్బలు తినే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు.

మిగతా »»2లో

# ఆ రెండు రాష్ట్రాల్లో కేజ్రీవాల్ మద్దతు ఎవరికి?



**ఢిల్లీ / శాసనసభ :** త్వరలో మహారాష్ట్ర, జారండ్‌లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆ రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. మీడియాకు అందిన వివరాల ప్రకారం ఆయన తన మిత్రపక్షం అయిన ఇండియా అలయన్స్‌తో పాటు ఇతర మిత్రపక్ష పార్టీలకు ప్రచారం చేయనున్నారు. కేజ్రీవాల్ మహారాష్ట్రలో మహావికాస్ అఘాడి (ఎంవీఏ) తరపున ప్రచారం చేయనున్నారు. పార్టీ వాలంటీర్లు ఉన్న అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేయనున్నారు.

మిగతా »»2లో

# సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

- దీపావళి బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడి
- ఒక్కో కార్మికుడి ఖాతాలో రూ.93,750 జమ చేయనున్న సింగరేణి సంస్థ
- 40 వేల మంది కార్మికుల ఖాతాల్లో రేపటి వరకు నగదు జమ

మిగతా »»2లో



# 4 కిలోల బంగారం, రూ.5 కోట్ల విలువైన ఇల్లు: ప్రియాంక గాంధీ ఆస్తుల వివరాలు ఇవిగో...!

మిగతా »»2లో



# అమెరికా - చైనా శత్రుత్వాన్ని భారత్ సద్వినియోగం చేసుకోలేదా?

**ఢిల్లీ / శాసనసభ :** అమెరికా, చైనాల మధ్య శత్రుత్వం ప్రపంచానికి దాపురించింది. వీరిద్దరి మధ్య చాలా కాలంగా ట్రేడ్ వార్ నడుస్తోంది. దీని ప్రయోజనాన్ని పొందడానికి, భారతదేశం తన తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నాలు చేసింది. కానీ,ఈ ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ వాణిజ్య యుద్ధం వల్ల ఇతర ఆసియా దేశాలు ఎక్కువ లాభపడ్డాయి. తాజా అధ్యయనంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ ప్రకారం.. 2017 -2023 మధ్య యూఎస్ దిగుమతులలో భారతదేశం యొక్క మొత్తం వాటా 0.6 శాతం పాయింట్లు పెరిగి



2.7%కి చేరుకుంటుందని అంచనా. అదే సమయంలో.. చైనా వాటా దాదాపు 8 శాతం క్షీణించి 14% కంటే తక్కువగా ఉంది.

మిగతా »»2లో

# ఫిరాయింపుల ముఠా నాయకుడు పోచారం





**శాసనసభ / హైదరాబాద్ :** పార్టీ ఫిరాయింపులకు పాల్పడకుండా చట్టం రూపొందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత , ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ లో ప్రస్తుత పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నాం. మానసిక ఆవేదనలో ఉన్నా. ఫిరాయింపుల పై ఖర్గేకు లేఖ రాశా. ఫిరాయింపుల చట్టం లొసుగులతో పార్టీ మారుతున్నారు. కొందరు అభివృద్ధి అనే నినాదంతో పార్టీ ఫిరాయించారు. పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు రాజీవ్ గాంధీ చట్టం తెచ్చారు. ఇప్పుడు ఆ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. కాంగ్రెస్ సుస్థిర ప్రభుత్వానికి కావాల్సిన మెజారిటీ ఉంది.. ఫిరాయింపుల అవసరం లేదు. దురదృష్టవశాత్తు నేను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా.. రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చిందని సంతోషించా. ఎమ్మెల్యే ల చేరికలు ఎందుకు అనేది అర్థం కాని పరిస్థితి. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అంటేనే జీవన్ రెడ్డి అనే పరిస్థితి ఉంది. పార్టీ నాకు అవకాశం ఇచ్చింది.. పార్టీకి నేను అంతే గౌరవం ఇచ్చా. పదేళ్లు బీఆర్ఎస్ దౌర్జన్యాలను ఎదుర్కొన్నాం. మళ్లీ కాంగ్రెస్ ముసుగులో దౌర్జన్యం చేస్తామంటే మేము ఎలా సహించాలి.

మిగతా »»2లో

# భారత్‌కు కెనడా వెన్నుపోటు పొడిచింది...

## సంబంధాల పతనం ఊహించలేదు: సంజయ్ వర్మ

2లో



- భారత్ పట్ల కెనడా అత్యంత అనైతికంగా ప్రవర్తించిందన్న సంజయ్ వర్మ
- కెనడాలో ట్రూడో క్రమంగా ప్రజాదరణ కోల్పోతున్నారని వ్యాఖ్య
- కెనడాలో హైకమిషనర్‌గా పని చేసిన సంజయ్ వర్మ

# భూములు లాక్కొని పెద్దలకు ఇస్తా అంటే పేదలు చూస్తూ ఊరుకోరు..



మిగతా »»2లో

( మొదటి పేజీ తరువాయి )

## సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కార్మికులకు దీపావళి బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రేపు మధ్యాహ్నం లోగా 40 వేల మంది కార్మికుల ఖాతాల్లో ఈ మొత్తం జమ అవుతాయని వెల్లడించింది. దీపావళి బోనస్ కింద ప్రతి కార్మికుడి ఖాతాలో రూ.93,750 క్రెడిట్ కానుంది.ఈరోజు సింగరేణిపై సచివాలయంలో జరిగిన సమీక్షలో బోనస్ జారీ చేయాలని ఉపముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది కంటే ఈసారి 50 కోట్ల అదనపు బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.బొగ్గు పరిశ్రమ కోసం జేబీసీసీఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా భట్టివిక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.ఇటీవలే ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లను కంపెనీ పంపిణీ చేసినట్లు సింగరేణి సంస్థ సీఎండీ తెలిపారు.

## ఈ లైన్ తో అన్ని రాజధానులకు అమరావతితో అనుసంధానం ఏర్పడుతుంది:

దీనికోసం రూ.2,245 కోట్ల నిధులు కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో, ఏపీ సీఎం చంద్రబాబు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టు ఆమోదించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని వెల్లడించారు. గుంటూరు, విజయవాడ నగరాలను కవర్ చేసేలా రాజధాని పక్కగా ఈ రైల్వే లైన్ వెళుతుందని వివరించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులకు ఈ రైల్వే లైన్ ద్వారా అమరావతితో అనుసంధానం ఏర్పడుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. వేల కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన అమరావతి రైల్వే ప్రాజెక్టు నాలుగేళ్లలో పూర్తవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రైల్వే లైను కృష్ణా నదిపై వెళుతుందని, ఇది ఎంతో రమణీయంగా ఉంటుందని చంద్రబాబు అభివర్ణించారు. ఈ సందర్భంగా కృష్ణా నదిపై కట్టే రైల్వే వంతెనను ఐకానిక్ బ్రిడ్జిగా నిర్మించాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరుతున్నామని తెలిపారు. ఏపీ రాజధాని అమరావతి నగరం దేశంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటవుతుందని, ఈ నగరం నిర్మాణానికి కేంద్రం అనేక మార్గాల్లో సాయం చేస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వెల్లడించారు. చాలా తక్కువ సమయంలోనే అమరావతి అంశాన్ని ప్రధాని మోదీ క్యాబినెట్ ముందుకు తీసుకెళ్లారని, అంతేకాకుండా, క్యాబినెట్ ఆమోదం కూడా లభించిందని అన్నారు.

## ఫిరాయింపుల ముఠా నాయకుడు పోచారం: జీవన్‌రెడ్డి

నామినేటెడ్ పదవులు, అధికారం చెలాయించాలని కొత్తగా చేరిన ఎమ్మెల్యే లు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో మా పరిస్థితి ఏంటి?. పార్టీ ఫిరాయింపుల ముఠా నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి. ఫిరాయింపుదారుల ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టి మాపై పెత్తనం చేయాలని పోచారం ఆదేశించారు. పది మంది ఎమ్మెల్యేలు లేకుండా మా ప్రభుత్వం కొనసాగదా. రాహుల్ గాంధీ కోరుకున్న ప్రజాస్వామ్య విలువలు ఇవ్వేనా.పార్టీ ఫిరాయింపులపై పోచారం శ్రీనివాస్‌రెడ్డికి చాలా అనుభవం ఉంది. పార్టీ ఫిరాయింపుల క్రమబద్ధీకరణకు పోచారం సలహాలు ఇస్తారు. అసలు పోచారం సలహాదారుడు ఏంటి? భట్టి సీఏల్పీ పదవి పోవడానికి పోచారం కారణం కాదా? రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలి.. పార్టీ బలోపేతం కావాలనేదే నా భవిష్యత్ కార్యాచరణ.గంగారెడ్డిని హత్యచేసిన సంతోష్ బీఆర్ఎస్ పార్టీ వ్యక్తి. ఎమ్మెల్యే చేరికతో సంతోష్ ఇప్పుడు కాంగ్రెస్ ముసుగు వేసుకున్నాడు. ఆదిపత్యపోరుతో గంగారెడ్డిని హత్యచేశారు. గంగారెడ్డి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పోటీలో ఉన్నారు. గుమ్మడి కాయ దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు డాక్టర్ సంజయ్ కుమారు నాకు హత్యతో సంబంధం లేదు అంటున్నారు. సంజయ్ ఇంట్లోనే కాంగ్రెస్ పుడితే.. బీఆర్ఎస్‌కలోకి ఎందుకు పోయాడు?. అధికార పార్టీలో చేరితేనే అభివృద్ధి జరుగుతుంది అంటే ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉంటుందా? చేరికలను నేను ముందే వ్యతిరేకించా" అని అన్నారు.

## ప్రజలు, రైతుల కోసం జైలుకు పోవడానికి రెడీ.. కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

### చీటింగ్ కేసు పెడితే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా మిగలడు..

జైలుకు పోవడానికి రెడీ.. ప్రజలు, రైతుల కోసం ఒకట్రెండు ఏండ్లు జైల్లో ఉండేందుకు సిద్ధం. ఎవనీ అయ్యకు భయపడేది లేదు. తప్పకుండా కాంగ్రెస్‌ను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయి. అసలు చీటింగ్ కేసులు ఎవరి మీద పెట్టాలి.. తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిన ఈ చార్ సౌ బీస్‌గాని మీద కేసులు పెట్టాలి. రైతుబంధు ఎగ్గొట్టి, రుణమాఫీ చేయనందుకు రైతులు కేసులు పెట్టాలి. 2 లక్షల ఉద్యోగాలని చెప్పి.. ఇప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనందుకు యువత కేసులు పెట్టాలి. ఇలా అన్ని వర్గాలు పోలీసు స్టేషన్ల ముందు లైన్లు కట్టి చీటింగ్ కేసు పెడితే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా ఈ రాష్ట్రంలో మిగలడు అని కేటీఆర్ తెలిపారు.

### పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే..

పోలీసులను కోరుతున్నా.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఇలాంటి కిరాతక పనులు బీఆర్ఎస్ పాలనలో చేయలేదు. మంత్రినో, కంత్రినో ఫోన్ చేస్తే ఆగం కాకండి.. న్యాయం, ధర్మం ప్రకారం నడుచుకోండి. పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే పేర్లు రాసిపెట్టి మిత్తితో సహా ఇస్తాం. రేవంత్ రెడ్డి రాజు, చక్రవర్తి కాదు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులతోనే కొట్లాడినం.. వీడెంత చిట్టినాయుడు.. గింతంత మనిషి.. వాని చూసి ఆగం కావొద్దు. ఉద్యోగులు పద్ధతి ప్రకారం ఉద్యోగం చేయండి. అతికి పోతే మా టైమ్ వచ్చాక మిత్తితో సహా ఇస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

### రైతుల మీద కేసులు పెడుతాం అంటే ఊరుకోం..

ఇదే ఆదిలాబాద్‌లో ఖానాపూర్ చెరువు వద్ద 2 వేల ఇండ్లు కూలగొట్టేందుకు అధికారులు వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆ ఇండ్లకు పర్మిషన్లు, పట్టాలు ఇచ్చారు. బాధితుడు బొడిగెం గంగన్న నాలుగు తిట్లు తిట్టిండు. ఇల్లు కూలగొడితే ఎవడన్న ఊకుంటాడా..? ఆయన తిట్టిండని ఆయన మీద కేసు పెట్టారు.. జైల్లో పెడుతారట.. వంద రోజుల్లో అన్ని చేస్తానని తప్పించుకున్న లుచ్చాగాళ్ల మీద కేసులు పెట్టాల్నా.? పేదల మీద కేసులు పెట్టాల్నా..? అల్లం బెల్లం ఇస్తామని అడ్డగోలు మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్న లుచ్చాగాళ్లపై చీటింగ్ కేసులు పెట్టాలి. రైతుల మీద కేసులు పెడుతాం అంటే ఊరుకునేందుకు సిద్ధంగా లేమని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# దక్షిణ మధ్య రైల్వేలో రూ.33 వేల కోట్లతో అభివృద్ధి పనులు

### అమృత్ భారత్‌లో రూ.2,635 కోట్లతో 40 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నాం ఎంపీల భేటీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్/అడ్డగుట్ట, అక్టోబరు 24(శాసనసభ) :** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.33 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు.రూ.83 వేల కోట్లతో చేపట్టనున్న 15 ప్రాజెక్టుల 'ఫైనల్ లొకేషన్ సర్వే' జరుగుతోందని చెప్పారు. రూ.430 కోట్లతో అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.720 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తవుతాయన్నారు.గురువారం రైల్ నిలయంలో రైల్వే ఉన్నతాధికారులు,తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఎంపీలతో జరిగిన సమీక్ష సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో, అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైలు తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తవుతుందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 40 స్టేషన్లను రూ.2,635 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పొడగించాలని నిర్ణయించామని,పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేకుండానే వచ్చే రెండేళ్లలో ఎంఎంటీఎసను యాదాద్రి వరకు పొడగిస్తామన్నారు. దీంతో జంట నగరాల నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఎంఎంటీఎస్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.800 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం ట్రాక్ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. గత ఆర్థిక సంవత్సరం జోన్ పరిధిలో 415 కి.మీ. అదనపు ట్రాక్‌ను జోడించినట్లు వివరించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ మాట్లాడుతూ తెలంగాణలో గత పదేళ్లలో 67 కొత్త రైళ్లను ప్రవేశపెట్టామన్నారు. వీటిలో 5 వందే భారత్



ఎక్స్‌ప్రెసలు కూడా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 268 రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీలు), 40 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్వోబీలు) నిర్మించామన్నారు.రైల్వే పనుల్లో జాప్యంపై పలువురు ఎంపీల అసంతృప్తి ఈ సమావేశంలో ఎంపీలు తమ నియోజకవర్గాల్లో చేపట్టిన రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. ప్రధానంగా కొత్త రైల్వే లైన్లు, బ్రిడ్జిల నిర్మాణం, రైళ్లకు అదనపు స్టాపేజీలతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపర్చాలని సూచించారు. కొల్లూరు ఈదులపల్లి సమీపంలో రైల్వే బ్రిడ్జి నిర్మించాలని 2016 నుంచి కోరుతున్నామని మెదక్ ఎంపీ రఘునందన్ తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని ఈదుల నాగులపల్లి రైల్వే స్టేషన్‌ను చర్లపల్లి తరహాలో అభివృద్ధి చేయాలన్నారు.ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి ఇంకా పూర్తి కాలేదని, చాలావరకు ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని రైల్వే ప్రాజెక్టులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాజ్యసభ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. హంద్రీ ఎక్స్‌ప్రెసను మళ్లీ నడపాలని కోరారు. లోకల్ రైళ్ల వేళలపై దృష్టి పెట్టాలని, ఏ రైలు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి ఉందని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు పెంచాలని ఎంపీ కడియం కావ్య, గరీబ్ రథ్‌తో పాటు ముఖ్యమైన రైళ్లను ఖమ్మంలో ఆపాలని ఎంపీ రఘురాంరెడ్డి కోరారు.

## కుటుంబ కలహాలు మామూలే! గొడవలు ఏ ఇంట్లో ఉండవు?

**విజయనగరం, అక్టోబరు 24(శాసనసభ) :** తల్లీ చెల్లితో ఆస్తి వివాదాలను 'సాధారణమైన అంశం'గా వైఎస్ జగన్ తేల్చేశారు. వారిద్దరిపై ట్రైబ్యునల్‌లో కేసు వేయడాన్ని కూడా 'మామూలు విషయం'గానే లెక్కకట్టారు. తాను డయేరియా బాధితులను పరామర్శించేందుకు వస్తున్నానని... జనం దృష్టిని మళ్లించేందుకే 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆరోపించారు. మీడియాలో తనపైనా, తన కుటుంబ సభ్యులపైనా వార్తలు రాయిస్తున్నారని ఆక్రోశించారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గురువారం విజయనగరం జిల్లాలో డయేరియా ప్రభావిత గ్రామమైన గుర్లలో పర్యటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం "రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వాటర్ ట్యాంకులు సకాలంలో శుభ్రం చేయించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. డయేరియా ఘటన నుంచి ప్రజలను మభ్యపెట్టేందుకు అనుకూల పత్రికలు, మీడియాలో నాకు, నా కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆస్తి తగాదాను తెరపైకి తెచ్చారు. కుటుంబ కలహాలు ఏ ఇంట్లో ఉండవు? అవి



మామూలే" అని జగన్ వ్యాఖ్యానించారు. మైకు వదిలేసి...: జగన్ మీడియా ముందుకు చేరుకోగానే.. వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎంత చెప్పినా వినకపోవడంతో.. 'మాట్లాడమంటారా.. వెళ్లిపొమ్మంటారా?' అని జగన్ అసహనం వ్యక్తం చేశారు. చివరకు మైకు వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిన్న శ్రీను, ఇతర నేతలు బతిమాలి జగన్‌ను మళ్లీ తీసుకొచ్చారు. జగన్ పరామర్శించేందుకు వీలుగా జనాన్ని, డయేరియా బాధితులను తీసుకొచ్చారు. కనీసం ఫ్యాను ఏర్పాటు చేయలేదు. ఒక దశలో టెంట్ కూడా కూలిపోయింది. వైసీపీ కార్యకర్తలు రచ్చ చేయగా... వారిని అదుపు చేయడంతో విఫలమయ్యారంటూ జగన్ పోలీసులపై చిర్రుబుర్రులాడడం గమనార్హం. మీడియా సమావేశం పెట్టడానికీ కూడా సహకరించరా అని చిందులు తొక్కారు. మరోవైపు... జగన్ కాన్వాయ్ కారు టైర్లు ఓ కానిస్టేబుల్ కాలుపైగా వెళ్లడంతో ఆయనకు గాయాలయ్యాయి.

## ఆ రెండు రాష్ట్రాల్లో కేజ్రీవాల్ మద్దతు ఎవరికి?

అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు, పార్టీ సీనియర్ నేతలు కూడా ఈ రెండు రాష్ట్రాలలో ప్రచార ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించే అవకాశం ఉంది.అరవింద్ కేజ్రీవాల్ జారండ్‌లో..జారండ్ ముక్తి మోర్చా అభ్యర్థుల కోసం ప్రచారం చేయనున్నారు. అలాగే ఇండియా బ్లాక్‌లోని అర్బన్ స్థానాలకు ఆయన ప్రచారం చేయనున్నారు.మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితం వెలువడనుంది. మహారాష్ట్రలో ప్రధాన పోటీ ఎంవీఏ పాలక మహాయుతికి మధ్యనే ఉంది. అధికార మహా కూటమిలో బీజేపీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్), శివసేన (ఏక్నాథ్ షిండే) ఉన్నాయి. రెండవ కూటమి మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (శరద్ పవార్) ఉన్నాయి. రెండు కూటముల్లోనూ సీట్ల పంపకం జరిగింది. ఎన్నికల ప్రచారం కూడా మొదలైంది.జారండ్‌లో నవంబర్ 13, నవంబర్ 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు నవంబర్ 23న జరగనుంది. జారండ్‌లో ఆల్ జారండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ), జనతాదళ్ (యునైటెడ్) (జేడీయూ),లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ) కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి.జారండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) రాష్ట్రీయ జనతాదళ్, కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల పోరులోకి దిగింది.

## భారత్‌కు కెనడా వెన్నుపోటు పొడిచింది... సంబంధాల పతనం ఊహించలేదు: సంజయ్ వర్మ

భారత్-కెనడా మధ్య సంబంధాలు పతనం కావడం ఊహించనిదని హైకమిషనర్‌గా పని చేసిన సంజయ్ వర్మ వెల్లడించారు. భారత్‌పై కెనడా ఇటీవల ప్రవర్తించిన తీరు చాలా అసహ్యంగా ఉందని మండిపడ్డారు. స్నేహపూర్వక ప్రజాస్వామ్యంగా భావించిన దేశం భారత్‌ను వెన్నుపోటు పొడిచిందన్నారు. అత్యంత అనైతికంగా ప్రవర్తించిందన్నారు.కెనడాలో జస్టిన్ ట్రూడో క్రమంగా ప్రజాదరణ కోల్పోతున్నారని వ్యాఖ్యానించారు. ఇప్పటికిప్పుడు కెనడాలో ఎన్నికలు జరిగితే ట్రూడో విజయం సాధించడం చాలా కష్టమన్నారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతినేలా కెనడా ప్రవర్తించిందన్నారు. కెనడాలో తాము ఎలాంటి రహస్య ఆపరేషన్లు చేయలేదని స్పష్టం చేశారు.కానీ భారత్‌పై కెనడా తీవ్ర ఆరోపణలు చేసిందని ధ్వజమెత్తారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు చూపించలేదని గుర్తు చేశారు. కెనడాలో న్యాయవ్యవస్థ సున్నితంగా ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు. అందుకే అక్కడ ఖలిస్థానీలు ఆశ్రయం పొందుతున్నారని ఆరోపించారు. అక్కడ ఖలిస్థాని మద్దతుదారులు కొంతమందే ఉన్నారని, వారే అక్కడి సిక్కు కుటుంబాలను వారు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఖలిస్థానీ ఉగ్రవాదులు అక్రమ వ్యాపారులు చేస్తున్నారని ఆరోపించారు.

( మొదటి పేజీ తరువాయి )

## అమెరికా-చైనా శత్రుత్వాన్ని భారత్ సద్వినియోగం చేసుకోలేదా?

అత్యధికంగా లాభపడిన వియత్నాం ..అయితే, వియత్నాం వాణిజ్య మళ్లింపులో అతిపెద్ద లబ్ధిదారుగా ఉంది. ఈ కాలంలో యూఎస్ దిగుమతులలో దాని మొత్తం వాటా 1.7 శాతం నుంచి 3.7% వరకు పెరిగింది. తైవాన్ దక్షిణ కొరియాలు కూడా యూఎస్ దిగుమతుల్లో తమ వాటాను వరుసగా 1 శాతం, 0.7 శాతం పెంచడం ద్వారా భారతదేశాన్ని అధిగమించాయి. ఈ అధ్యయనం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా తెలిపింది. దేశంలో వెనుకబడిన తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని పేర్కొంది.డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడైతే.డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడైతే, చైనా వస్తువులపై 60% సుంకాలను విధించే బెదిరింపును అమలు చేస్తే భారతదేశం గణనీయమైన లాభాలను పొందడం కష్టమని పరిశోధనలు సూచిస్తున్నాయి. "అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ఇప్పటివరకు భారతదేశ ఎగుమతి అవకాశాలను పరిమిత స్థాయిలో మాత్రమే మెరుగుపరిచింది" అని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ ఆర్థికవేత్త అలెగ్జాండ్రా హర్మాన్ ఒక నోట్‌లో రాశారు. వివాదాల తీవ్రత వెనుకబడి ఉన్న తయారీ రంగానికి ఊతమిస్తుందన్న ఆశ అడియాశలైంది. భారతదేశం యొక్క ఎగుమతి బలం ఎక్కువగా 'పాత ఆర్థిక వ్యవస్థ' రంగాలలో ఉంది. ఇక్కడ వృద్ధి అవకాశాలు పరిమితంగా ఉంటాయి. పోటీ తీవ్రంగా ఉంటుంది. అని పేర్కొన్నారు.భారతదేశం ఎక్కడ వెనుకబడి ఉంది? అమెరికాకు ఎలక్ట్రానిక్స్ ఎగుమతులను ప్రోత్సహించడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. కానీ, చైనా నుంచి విడిభాగాల దిగుమతి కూడా పెరిగింది. దేశీయ తయారీలో చాలా తక్కువ విలువ జోడింపు జరిగినట్లు ఇది చూపిస్తుంది. ఆక్స్‌ఫర్డ్ ప్రకారం.. 2023లో భారతదేశం దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్స్, మెషినరీ, కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్‌లో మూడో వంతు చైనా వాటాను కలిగి ఉంటుందని అంచనా. కొన్ని సెమీకండక్టర్ పరికరాల వంటి భాగాల కోసం భారతదేశం యొక్క 67% దిగుమతులు చైనా నుంచి వచ్చాయి. ఇది భారతదేశం యూఎస్ వాణిజ్య ఆంక్షలకు లోబడే ప్రమాదంలో పడింది. వియత్నాం వంటి ఇతర మూడవ దేశాలు ఇప్పటికే యూఎస్ రక్షణవాదాన్ని ఎక్కువగా అనుభవిస్తున్నాయి. చైనాలోకి ఎఫ్‌డిఐ ప్రవాహం తక్కువగా ఉన్నప్పటికీ, ప్రపంచ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో భారత్ పెద్దగా వాటాను ఆకర్షించలేకపోయింది.


## భూములు లాక్కొని పెద్దలకు ఇస్తా అంటే పేదలు చూస్తూ ఊరుకోరు..

అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి చేసేది పేదల కోసం కాదు..డబ్బు సంచుల కోసం, బ్లాక్ మెయిలింగ్ కోసమని ఆరోపించారు. తాము ప్రజల పక్షాన మాట్లాడుతుంటే.. నడమంత్రపు సిరితో ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడవద్దని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ఖబర్ధార్.. మూసీలో దుర్గంధం క్లీన్ చెయ్యి కానీ, మా భూములు లాక్కొని పెద్దలకు ఇస్తా అంటే పేదలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మా బొందల గడ్డ చూస్తామంటే మీ బొందలగడ్డ చూస్తాం అని ప్రజలు అంటున్నారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రేపు మూసీ బాధితుల కోసం ఇందిరా పార్కు దగ్గర బీజేపీ ధర్నా నిర్వహించ తలపెట్టింది. తాము వారికి అండగా ఉంటామని ఈటల రాజేందర్ తెలిపారు.మూసీ, చెరువల పక్కన ఉన్నవాళ్లకు నాలుగు నెలలుగా కంటిమీద కునుకులేకుండా పోయిందని ఈటల రాజేందర్ తెలిపారు. పొట్టచేత పట్టుకొని హైదరాబాద్‌కు వచ్చి ఒక తరం త్యాగం చేసి పైసా పైసా కూడబెట్టుకుంటే 50 గజాల జాగా కొనుక్కున్నారు.. చనిపోతే అనాథ శవంలా పోవద్దు అని ఇళ్ళు కట్టుకుంటే.. ఇప్పుడు అర్ధరాత్రి వచ్చి ఇళ్ళు కూలగొడుతున్నారని తెలిపారు. ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.. చెరువుల పక్కన, మూసీ పక్కన ఉన్నవి అన్నీ ప్రభుత్వ భూములు కావు, పట్టా భూములు కూడా ఉన్నాయి.. అందులో బ్యాంక్ రుణాలు తీసికొని కట్టుకున్న ఇళ్ళు కూడా ఉన్నాయని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు.అనంతరం.. ఈటల రాజేందర్‌తో స్థానికులు తమ సమస్యలు చెప్పుకున్నారు. 1985 నుండి తమ భూములకు పక్కా కాగితాలు, రికార్డ్స్ ఉన్నాయన్నారు. పట్టా భూములు కొనుక్కున్నాం.. ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి ఇప్పుడు అక్రమం అంటే తప్పు ఎవరిది? అని ఎంపీకి చెప్పారు. అప్పు చేసి కట్టుకున్నాం, ఇప్పుడు అప్పులు తీరాయి అనుకుంటే రేవంత్ రెడ్డి వచ్చి ఇళ్ళు గుంజుకుంటున్నాడని వాపోయారు. తమ అందరినీ పంపించి షాపింగ్ మాల్స్ కడతా అంటే ఎవరికోసం.. బ్యూటిఫికేషన్ ఎవరి కోసం.. ఇది న్యాయమా? అని అన్నారు. దోమలు, వాసన ఉందని తామే వెళ్ళిపోతామని చెప్పడం పచ్చి అబద్ధం అని స్థానికులు ఎంపీ ఈటల రాజేందర్ కు తెలిపారు. ప్రభుత్వ పెద్దలు ఊసరవెల్లిలా రోజుకో మాట మాట్లాడుతున్నారు.. రేవంత్ రెడ్డి ఇక్కడికి రావాలి.. అసలు ఇప్పటివరకు ఏ ఒక్క ప్రజా ప్రతినిధి కానీ, అధికారి కానీ మాట్లాడలేదు.. మీరు వచ్చారు కానీ ఏ ఒక్కరూ రాలేదని స్థానికులు చెప్పారు.

## 4 కిలోల బంగారం, రూ.5 కోట్ల విలువైన ఇల్లు: ప్రియాంక గాంధీ ఆస్తుల వివరాలు ఇవిగో...!

- వయనాడ్ లోక్ సభకు నామినేషన్ దాఖలు చేసిన ప్రియాంక గాంధీ
- రూ.12 కోట్ల విలువైన ఆస్తులను ప్రకటించిన కాంగ్రెస్ నాయకురాలు
- రూ.4.24 కోట్ల చరాస్తులు, రూ.7.74 కోట్ల స్థిరాస్థులు వెల్లడిద

కేరళలోని వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ప్రియాంక గాంధీ తన ఆస్తులను రూ.12 కోట్లుగా ప్రకటించారు. తల్లి సోనియా గాంధీ, సోదరుడు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో కలిసి వచ్చిన ప్రియాంక నిన్న నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తన ఎన్నికల అఫిడవిట్లో ఆస్తుల వివరాలను వెల్లడించారు.తనకు ఉన్న రూ.12 కోట్ల విలువైన ఆస్తిలో రూ.4.24 కోట్ల విలువ చేసే చరాస్తులు, రూ.7.74 కోట్ల విలువ చేసే స్థిరాస్తులు ఉన్నట్లుగా ప్రకటించారు. మూడు బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. తన భర్త రాబర్ట్ వాద్రా బహుమతిగా ఇచ్చిన హోండా సీఆర్వీ కారు, రూ.1.15 కోట్ల విలువైన 4 కిలోలకు పైగా బంగారు నగలు ఉన్నట్లు పేర్కొన్నారు.దేశ రాజధాని ఢిల్లీలోని మెహ్రౌలీ ప్రాంతంలో వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి, ఫామ్ హౌస్‌లో సగం వాటా ఉన్నట్లు వెల్లడించారు. సిమ్లాలో తన పేరిట రూ.5.63 కోట్ల విలువైన ఓ నివాస భవనం ఉందన్నారు.గత ఆర్థిక సంవత్సరంలో తన ఆదాయం రూ.46.39 లక్షలుగా ఉందని పేర్కొన్నారు. భర్త రాబర్ట్ వాద్రా నికర ఆస్తులు రూ.65.54 కోట్లుగా ప్రియాంక గాంధీ వెల్లడించారు. ఇందులో రూ.37.9 కోట్ల చరాస్తులు, రూ.27.64 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు తెలిపారు.



## పేగుల్లో ఉన్న చెత్త మొత్తం క్లీన్ అవుతుంది..

# ఇలా చెయ్యండి చాలు..!

ప్రతి ఒక్కరు కూడా, ఆరోగ్యంగా ఉండాలని అనుకుంటుంటారు. ఆరోగ్యంగా ఉండడం కోసం, చాలామంది, వివిధ రకాల పద్ధతుల్ని పాటిస్తూ ఉంటారు.అయితే, నిజానికి అనారోగ్య సమస్యలు ఏమి లేకుండా, ఆరోగ్యంగా ఉంటే చక్కగా మన పని మనం చేసుకుని సంతోషంగా ఉండొచ్చు. పంచతంత్రాలని అనుసరించడం వలన, ఆరోగ్యం బాగుంటుంది. పంచతంత్రలో మొట్టమొదటిది రోజుకి నాలుగు ఐదు లీటర్లు నీళ్లు తాగడం. రోజు రెండుసార్లు మలవిసర్జన చేయాలి. దీనివలన శరీరం అంతా కూడా, శుభ్రంగా ఉంటుంది. లివర్ డిటాక్సిఫికేషన్ బాగా జరుగుతుంది.ఒంట్లో ఉండే కెమికల్స్, టాక్సిన్స్ వంటివి ఈజీగా బయటికి వెళ్లిపోతాయి. ఆరోగ్యంగా ఉండొచ్చు. అలానే, రాత్రి పూట ఆలస్యంగా తినడం మంచిది కాదు. రాత్రిళ్ళ వేగంగా ఆహారాన్ని తీసుకోవాలి. ఆరోగ్యాన్ని రాత్రిపూట ఏడులోగా భోజనం చేసేస్తే, ఆరోగ్యం బాగుంటుంది. అలానే, రోజుకి రెండుసార్లు మాత్రమే ఆహారాన్ని తీసుకోవాలి. ఇది కూడా ఆరోగ్యంగా మిమ్మల్ని ఉంచుతుంది.కేవలం రోజుకి రెండే సార్లు ఆహారాన్ని తీసుకోవాలి. రెండు సార్లు కంటే ఎక్కువ ఆహారాన్ని అస్సలు తినకూడదు. అలానే, రోజులో ఒక్కసారైనా వండకుండా నేచురల్ గా ఆహారాన్ని తీసుకోవాలి. ఇది కూడా చాలా ముఖ్యమైనది. అంటే, పచ్చి కూరగాయలతో రసం చేసుకోవడం, లేదంటే పచ్చి కూరగాయలు పండ్లు తీసుకోవడం. ఇలా భోజనం తినడానికి ఒక గంట ముందు, కూరగాయల రసం వంటివి తీసుకోవచ్చు. ఆరోగ్యానికి ఇవి బాగా ఉపయోగపడతాయి. వండని ఆహార పదార్థాలని 60% వరకు తీసుకోవాలి. ఇలా, తినడం వలన ఉప్పు, నూనె వంటివి మనకి అందువు. ఆరోగ్యంగా ఉండొచ్చు. సాయంత్రం డిన్నర్ టైంలో కూడా నాచురల్ ఆహారాన్ని తీసుకోవడం మంచిది. అంటే, వండకుండా ఉడకబెట్టుకోకుండా పచ్చివి తీసుకోవడం, పండ్లు, డ్రై ఫ్రూట్స్ ఇటువంటివన్నీ కూడా తీసుకోవచ్చు. ఇవన్నీ అనుసరిస్తూ ప్రాణాయామం, యోగా వంటి వాటికోసం సమయాన్ని వెచ్చించండి. ఇలా చేస్తే ఆరోగ్యం బాగుంటుంది.

## బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు భారత్‌లో "సురక్షిత నివాసం".. ఏ ప్రాంతంలో తెలుసా?



**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆగస్ట్ 5న ఢాకా నివాసం నుంచి హఠాత్తుగా బయలుదేరాల్సి వచ్చింది. ఆ సమయంలో ప్రభుత్వ వ్యతిరేకులు ఆమె ఇంటిపై దాడి చేశారు.ఆపై ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీసిన షేక్ హసీనా భారత్ లో తలదాచుకున్నారు. ఆ సమయంలో ఢిల్లీకి ఆనుకుని ఉన్న ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌లో కేంద్ర ప్రభుత్వం ఆమెను ఆపింది. అయితే, షేక్ హసీనాను వెనక్కి పంపాలని బంగ్లాదేశ్ భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉంది. అయితే బంగ్లాదేశ్ మాజీ ప్రధాని మాత్రం తన దేశానికి తిరిగి వచ్చే ఆలోచనలో లేరు. కాగా, ఢిల్లీలోని లుటియన్స్ జోన్‌లోని బంగ్లాకు షేక్ హసీనా మారినట్లు సమాచారం.ఢిల్లీకి షిఫ్ట్ అయిన షేక్ హసీనా..'ది ప్రింట్'లో ప్రచురితమైన నివేదిక ప్రకారం.. షేక్ హసీనా ఢిల్లీకి షిఫ్ట్ అయ్యి రెండు నెలలకు పైగా అవుతోంది. ఆమె బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అందుకే కేంద్ర ప్రభుత్వం ఆమె బస, భద్రతకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. లుటియన్స్ మండలంలోని ఓ బంగ్లాలో నివాసం ఉంటున్నారు. ఈ బంగ్లా కేంద్రమంత్రులు, సీనియర్ ఎంపీలు, ఉన్నతాధికారులకు కేటాయించిన బంగ్లా తరహాలోనే ఉంటుంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని భద్రత, గోప్యతను దృష్టిలో ఉంచుకుని, నివేదికలోఆ బంగ్లా గురించి వెల్లడించలేదు.ఢిల్లీలోని లుటియన్స్ జోన్ లో..నివేదిక ప్రకారం. షేక్ హసీనా నివాసం చుట్టూ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసులు, భద్రతా సిబ్బంది 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారు. వారు సాధారణ దుస్తులలో గస్తీ కాస్తున్నారు. సరైన భద్రతా ప్రోటోకాల్‌లతో.. షేక్ హసీనా లోధి గార్డెన్‌లో అప్పుడప్పుడు వాకింగ్‌కి కూడా వెళ్తున్నారు. ఆమె దాదాపు రెండు నెలలుగా ఈ ప్రాంతంలో నివాసముంటున్నారు. మూలాల ప్రకారం.. హసీనాకు సన్నిహితంగా ఉన్న కొందరు ఆగస్టు 5 రాత్రి బంగ్లాదేశ్ ఎయిర్ ఫోర్స్ విమానంలో హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నారు. అయితే.. ఆమె రెండు రోజుల్లోనే హిండన్ ఎయిర్‌బేస్‌ను విడిచిపెట్టారు.షేక్ హసీనా భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు..బంగ్లాదేశ్‌ను విడిచిపెట్టి ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్న తర్వాత షేక్ హసీనాను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, సీనియర్ సైనిక అధికారులు కూడా కలిశారు. 'ది ప్రింట్' నివేదిక ప్రకారం.. షేక్ హసీనా హిండన్ ఎయిర్‌బేస్‌లో ఎక్కువ కాలం ఉండలేరని వర్గాలు తెలిపాయి. అక్కడ ఏర్పాట్లు సరిగా లేవు. కాబట్టి, కొద్ది రోజుల్లోనే.. ఆమెను సురక్షితమైన ప్రదేశానికి తీసుకెళ్లి ఆపై లుటియన్స్ ఢిల్లీలోని సురక్షితమైన ప్రాంతంలో బంగ్లాలో బస ఏర్పాటు చేశారు. ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రధాన భద్రతా బృందానికి తెలియజేస్తారు. ఆ తర్వాత అక్కడికి వెళ్లేందుకు భద్రతా సిబ్బంది ఏర్పాట్లు చేస్తారు.షేక్ హసీనా బసపై కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదు..అయితే, షేక్ హసీనా బసకు సంబంధించి భారత ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుతానికి హసీనా భారత్‌లో పర్యటించేందుకు అనుమతి కోరినట్లు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆగస్టులో పార్లమెంట్ సమావేశాల సందర్భంగా చెప్పారు. హసీనాతో పాటు ఆమె సోదరి షేక్ రెహానా కూడా ఇండియాకు వస్తున్నారు. ఆమె బ్రిటిష్ పౌరురాలు కుమార్తె తులిప్ సిద్ధిఖీ యూకేలోని లేబర్ పార్టీ నాయకురాలు. అయితే.. ఆమె తన సోదరితో కలిసి ఇంట్లో ఉంటుందా లేదా అనేది క్లారిటీ లేదు. హసీనా కుమార్తె సైమా వాజెద్ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఢిల్లీ ప్రధాన కార్యాలయంలో సౌత్-ఈస్ట్ ఆసియా రీజియన్ రీజినల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమె కూడా ఢిల్లీలోనే ఉంటున్నారు. ఈ పదవి చేపట్టిన తొలి బంగ్లాదేశీ ఆమె.

# ఇప్పటివరకు ఎన్ని కలియుగాలు దాటాయి..

## ప్రస్తుతం మనం ఏ కలియుగంలో ఉన్నాం?



సినిమాలో కమల్ హాసన్ 'కలి' పాత్రలో నటించిన విషయం అందరికీ తెలిసిందే. ప్రజల నుంచి ప్రకృతిని లాక్కొని తన ఆధీనంలో పెట్టుకుని లోకాన్ని శాసిస్తుంటాడు.తన వయసుని పెంచుకోవడానికి గర్భస్త శిశువు నుంచి సీరమ్‌ని సేకరించి ఇంజెక్ట్ చేసుకుని మరణం లేని రాక్షసుడిగా మారుతుంటాడు. కలిని అంతం చేసేందుకు ఆ శ్రీ మహా విష్ణువు 'కల్కి' అనే దేవుడి అవతారంలో జన్మిస్తాడని హిందూ పురాణాలు చెబుతున్నాయి. అయితే, కలి పాలించిన యుగాన్ని కలియుగంగా పరిగణిస్తుంటాం. మరి, యుగాలు ఎన్ని ఉంటాయి? ఎన్ని సంవత్సరాలకోసారి ఈ కలియుగం వస్తుంటుంది? అనే విషయాలపై ఆసక్తి పెరిగింది.హిందూయిజం ప్రకారం.. యుగచక్రం ఉంటుంది. ఈ యుగచక్రంలో నాలుగు యుగాలు ఉంటాయి. సత్య యుగం మొదటిది కాగా, త్రేతా యుగం, ద్వాపర యుగం.. చివరికి కలియుగం. ప్రతి యుగం ముగిసిన తర్వాత మరో యుగం మొదలవుతుంది.**ఎన్నో మార్పులు** యుగం మారిన కొద్దీ ప్రజల లైఫ్‌స్టైల్ మారుతుంటుంది. సత్య యుగంలో ఉండే మనుషులు త్రేతాయుగంలో కనిపించరు. అలా తరాల మధ్య అంతరం పెరుగుతుంది. ప్రస్తుతం మనం కలియుగంలో ఉన్నామని పురాణాలు చెబుతున్నాయి. అయితే, ఇది మొదటి కలియుగం కాదు. ఇప్పటికే ఎన్నో కలియుగాలు అయిపోయాయి. భవిష్యత్‌లో కూడా మరిన్ని కలియుగాలు రానున్నాయి. ఇందుకు సంబంధించిన సమాచారం పూర్తిగా మన పవిత్ర గ్రంథాల్లో నిక్షిప్తంచేసి ఉంది.

**కాలం ఎలా లెక్కిస్తారంటే?** హిందూ విశ్వాసాల ప్రకారం కాలాన్ని బ్రహ్మ జీవిత కాలంతో పోలుస్తారు. బ్రహ్మ జీవిత కాలం 100 ఏళ్లు. మన సమయం, బ్రహ్మదేవుడి సమయం ఒకటి కాదు. మనకు ఏడాది అంటే 365 రోజులు. కానీ, బ్రహ్మకు ఒక రోజు అంటే 4.32 బిలియన్ సంవత్సరాలతో సమానం. దాదాపు మానవుడి నాగరికత 4.32 బిలియన్ సంవత్సరాలు పూర్తయితే బ్రహ్మ దేవుడికి ఒక రోజు ముగిసినట్లు లెక్క. బ్రహ్మ దేవుడి ఒక రోజు కాలం 14 మన్వంతరాలతో సమానం.ఒక్కో మన్వంతరంలో 4 యుగాలు ఉంటాయి. ఈ లెక్కన కలియుగ కాలం 4,32,000 సంవత్సరాలు. ఈ గడువు పూర్తయితేనే కలియుగం ముగిసినట్లు అని అర్థం చేసుకోవాలి. బ్రహ్మ జీవిత కాలం ప్రకారం ప్రస్తుతం మనం 91వ సంవత్సరంలో ఉన్నాం. 28వ మహాయుగంలో 2,448వ కలియుగం నడుస్తోంది. అంటే, ఇప్పటికే 2,447 కలియుగాలు ముగిసిపోయాయి.కాక్‌భూషుంది రుషి చరిత్ర ప్రకారం. మహారుషి లోహాస్ శాపం మేరకు కాక్‌భూషుంది కాకిగా మారతాడు. రామమంత్రాన్ని జపించిన అనంతరం శాప విముక్తుడు అవుతాడు. అయితే, శాప విముక్తుడు కావడానికి ఎన్నో యుగాలు పట్టింది. తన జీవిత కాలంలో 11 రామాయణాలు, 16 మహాభారతాలను చూసినట్లు రుషి చరిత్ర చెబుతోంది. అంటే, ప్రతి యుగం మళ్లీ మళ్లీ వస్తుందన్నమాట. ఈ ప్రాతిపదికన కలియుగాన్ని కూడా ఈ రుషి ఎన్నోసార్లు దర్శించి ఉంటాడు. బ్రహ్మ అస్తమించేవరకు ఈ చక్రం ఇలాగే కొనసాగుతూ ఉంటుంది. కొత్త మన్వంతరం మొదలవుతుంది.

# పప్పుల ధరలపై సామాన్యులకు కేంద్రం శుభవార్త!



**శాసనసభ /హైదరాబాద్** నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకి సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితులు ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు ఊరట కలిగించే మరొక కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. పప్పులపై ఉన్న రాయితీని విస్తరించి భారత బ్రాండ్ ద్వారా పప్పులను తక్కువ ధరలకు అందించడానికి చర్యలు తీసుకుంది. కందిపప్పు, శనగ పప్పు, పెసర పప్పు, ఎర్ర పప్పుల ధరలను అందుబాటులోకి తెచ్చే చర్యలు ప్రారంభించింది.రిటైల్ ధరలకు భారత్ బ్రాండ్ తో బియ్యం, పప్పులు ఇక ఈ చర్యలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తృణధాన్యాలు మైసూర్ పప్పులను భారత బ్రాండ్ లో చేర్చింది. భారత్ బ్రాండ్ ను దేశవ్యాప్తంగా కేంద్రం గత సంవత్సరం అక్టోబర్‌నెలలో ప్రారంభించిం ది. తొలిదశలో బియ్యం, గోధుమ పిండితో పాటు, పప్పులనురిటైల్ ధరలకు అందుబాటులోకి తీసుకువచ్చి ంది.భారత్ బ్రాండ్ రెండవ దశ ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్రం గుడ్ న్యూస్ అయితే తాజాగా భారత్ బ్రాండ్ రెండవ దశ ప్రారంభోత్సవం సందర్భం గా శనగపప్పు కిలో ధరను 58 రూపాయలు గాను, మైసూర్ పప్పు 89 రూపాయలు గానూ నిర్ణయించింది. ఈ ధరలు మార్కెట్ ధరల కంటే కనీసం 20% నుండి 25% వరకు తక్కువగా ఉన్నాయని పేర్కొంది. ఈ ధరలు బఫర్ స్టాక్ నుండి సబ్సిడీతో అందించ బడతాయని కేంద్రం తెలిపింది.త్వరలోనే రిటైల్ మార్కెట్లో శనగపప్పు, మైసూర్ పప్పు ప్రభుత్వం సహకార సంఘాలకు మూడు లక్షల టన్నుల శనగపప్పు 68,000 టన్నుల మైసూర్ పప్పులను కేటాయించింది. శనగపప్పు మైసూర్ పప్పు రిటైల్ మార్కెట్లో త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్టు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. భారత్ బ్రాండ్ ద్వారా అందించే ఈ నిత్యవసర సరుకులు ఈ కామర్స్ ప్లాట్ఫామ్స్, రిటైల్ స్టోర్ లో అందించడం కోసం చర్యలు తీసుకుంటున్నట్టు కూడా ఆయన పేర్కొన్నారు .ధరలను నియంత్రించే ప్రయత్నంలో భాగంగా కేంద్రం నిర్ణయం విపరీతంగా పెరుగుతోన్న ధరలను నియంత్రించే ప్రయత్నంలో, సామాన్యులకు అందుబాటు ధరలలో నిత్యావసరాలను అందించటంలో భాగంగానే సబ్సిడీపై పప్పులను అందించాలని కేంద్రం నిర్ణయించింది. కాగా, మార్కెట్ లో శనగపప్పు రూ.110, మైసూర్ పప్పు రూ.115కు పైనే ఉంది. అమెజాన్, జియోమార్ట్‌తో పాటు బిగ్‌బాస్కెట్, బ్లింకిట్‌లో భారత్ బ్రాండ్ సబ్సిడీ పప్పులను ఆర్డర్ పెట్టుకోవచ్చు.సహకార సంఘాల ద్వారా రిటైల్ మార్కెట్లో పప్పులు నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ కన్స్యూమర్ కోపరేటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అలాగే సెంట్రల్ రెండు సహకార సంఘాల ద్వారా రిటైల్ మార్కెట్లో సబ్సిడీతో కూడిన పప్పులను అందించనున్నాయి. ఏది ఏమైనా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు గుడ్ న్యూస్ అని చెప్పాలి.

# వందలాది రైఫిల్ బుల్లెట్లతో రైలులో ప్రయాణించిన అమ్మాయి



**శాసనసభ / న్యూఢిల్లీ** ఉత్తరప్రదేశ్ లోని బల్లియాలో GRP బుధవారం వారణాసి ఛప్రా ప్యాసింజర్ రైలు నుండి రైఫిల్స్ సంబంధించిన 750 బుల్లెట్లతో ఒక అమ్మాయిని అరెస్టు చేసారు పోలీసులు. మిర్జాపూర్‌కు చెందిన బాలిక బట్టలకు బదులు ట్రాలీ బ్యాగ్‌లో బుల్లెట్లు పెట్టుకుని చాప్రా వెళ్తోంది. ప్రస్తుతం పోలీసులు బాలికను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రైఫిల్స్ కాకుండా, ఈ 315 బోర్ బుల్లెట్లను నేరస్థులు అక్రమ పిస్టల్స్‌లో ఉపయోగిస్తారు. ఇక బాలిక విచారణలో మరో ఇద్దరి పేర్లు బయటపడ్డాయి. పోలీసులు అమ్మాయిపై ఫిర్యాదు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.గోరఖ్‌పూర్ ఎస్పీ ఆదేశాల మేరకు జీఆర్‌పీ బుధవారం రైళ్లలో ఇంటెన్సివ్ చెకింగ్ మొదలు పెట్టింది. కాగా, వారణాసి నుంచి చాప్రా వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఉదయం 8.40 గంటల ప్రాంతంలో స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫారమ్‌కు చేరుకుంది. రెండో బోగీలో కూర్చున్న ఓ బాలిక సీటు కింద ఉన్న ట్రాలీ బ్యాగ్‌ని జీఆర్పీ తనిఖీ చేయగా అందులో వందలాది కాట్రిడ్జ్‌లు ఉండడంతో అక్కడి వారందరు ఆశ్చర్యానికి గురయ్యారు. దాంతో బాలికను బ్యాగ్‌తో సహా స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విచారణలో అంకిత్ కుమార్ పాండే, రోషన్ యాదవ్ తనకు క్యాట్రిడ్జ్‌లతో కూడిన బ్యాగ్ ఇచ్చారని బాలిక చెప్పింది. ఆ సంచి చాపర్‌లోని ఓ వ్యక్తికి ఇవ్వాల్సి ఉందని తెలిపింది. బాలికను మీర్జాపూర్‌లోని రాజ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిహార్ నివాసి మణితా సింగ్‌గా గుర్తించారు. బాలికతో పాటు ఘాజీపూర్ జిల్లా కరీముద్దీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బరాచ్‌వార్ నివాసి సుశీల్ పాండే కుమారుడు అంకిత్ కుమార్ పాండే, నసీర్‌పూర్ కటారియా నివాసి రామ్‌నారాయణ్ సింగ్ యాదవ్ కుమారుడు రోషన్ యాదవ్‌పై పోలీసులు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు సంబంధించి ఒక టీమ్ ఛప్రా వెళ్తుంది. ప్రస్తుతం ఇంత పెద్ద సంఖ్యలో బుల్లెట్లు ఎక్కడి నుంచి వచ్చాయో పోలీసులు ఆరా తీస్తున్నారు. వాటిని బట్వాడా చేసేది ఎవరు? ఈ కేసులో ఎంత పెద్ద రాకెట్ దాగుందని పోలీసులు అనుమానిస్తున్నారు.




**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు దీపావళి ప్రత్యేక బోనస్ ప్రకటించింది. ఈ బోనస్ ద్వారా సర్కార్ రూ. 358 కోట్లు విడుదల చేసింది.ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరాలు తెలిపారు. శుక్రవారం ప్రతి కార్మికుని ఖాతాలో రూ. 93,750 జమ కానున్నాయి. ఈ బోనస్ 42,000 మంది కార్మికులకు అందించబడనుంది. ముందుగా లాభాల వాటంగా కార్మికులకు రూ. 796 కోట్లను సగటున రూ. 1.90 లక్షలు పంపిణీ చేయడం గమనార్హం.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, సీఎం రేవంత్ రెడ్డి తన ప్రత్యేక శైలిని చూపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేస్తున్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం, తెలంగాణలో ఉద్యోగుల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు సమాచారం. అదేవిధంగా, సింగరేణి గనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ గనుల ద్వారా విద్యుత్ మరియు బొగ్గు విక్రయం ద్వారా ఆదాయం వస్తుంది. సింగరేణి కాలరీస్ లో పని చేసే కార్మికులు తమ ప్రాణాలకు ప్రమాదం ఉన్నా కూడా కష్టపడుతున్నారు. అలాంటి కార్మికుల కోసం రేవంత్ సర్కార్ దీపావళి ప్రత్యేక బోనస్ అందించింది.

## రేవంత్ రెడ్డి నిజంగా చరిత్రలో నిలిచిపోతారు.. సీఎంపై మండిపడ్డ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**శాసనసభ / హైదరాబాద్ :** బెటాలియన్లలో పని చేస్తున్న పోలీసు కానిస్టేబుళ్ల చేత కూలీ పనులు చేయిస్తున్నారని, తక్షణమే వన్ పోలీస్ విధానం అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుళ్ల భార్యలు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే.బెటాలియన్ల ముందు ధర్నాకు దిగిన కానిస్టేబుళ్ల భార్యలపై మహిళా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆందోళనకు దిగిన మహిళలపై చేయి చేసుకుంటూ బలవంతంగా పోలీసు జీపుల్లో ఎక్కించారు. ఈ ఘటనలపై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందించారు.బెటాలియన్లలో కానిస్టేబుల్స్‌గా కొనసాగుతున్న తమ భర్తలకు న్యాయం చేయాలని పోరాడుతున్న వారి భార్యలపై యూనిఫాంలో ఉన్న మరో మహిళా కానిస్టేబుల్ చేయి చేసుకునే స్థాయికి ఎదిగింది కాంగ్రెస్ పాలనలో ఈ రాష్ట్రం. ఒక గొప్ప చరిత్ర ఉన్న తెలంగాణ పోలీసు డిపార్ట్‌మెంట్ పరువును రేవంత్ రెడ్డి దిగజార్చారు. రేవంత్ రెడ్డి నిజంగా చరిత్రలో నిలిచిపోతారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఇది పూర్తిగా తప్పు.. ఖండించదగ్గ విషయమని ఆయన తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డికి పోలీసు కుటుంబాల గోస వినే సమయం లేనట్లుంది.. కనీసం మీరైనా తక్షణమే స్పందించి, సున్నితమైన ఈ సమస్యను పరిష్కరించాలని డీజీపీని ఆర్ఎస్పీ కోరారు. పోలీసుల మనసుల్లో అశాంతి ఉండకూడదు. పోలీసు బాసులు అశాంతిని దరిచేరనీయకుండా చూడాలన్న విషయం మీకు తెల్వనిది కాదు. ఈ వివాదం మరింత ముదిరితే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మరింత విషమిస్తుంది. ఇప్పటికే పట్టపగలే మర్డర్లు జరుగుతున్న పట్టించుకునే నాథుడే లేడు. అందుకే దయచేసి కొంత కాలం పాత పద్దతి లోనే రికార్డెడ్ పర్మిషన్ ని కొనసాగించండి. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అప్పుడు కొత్త ప్రయోగం చేయండి అని డీజీపీకి ఆర్ఎస్పీ సూచించారు.పోలీసులే తమ సోదరుల భార్యలను ఈడ్చుకుంటూ పోవడం చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయి. మనందరి మూడు దశాబ్దాల సర్వీసులో డీజీపీలు ఎవ్వరూ ఈ పరిస్థితిని రానివ్వలేదు. ఎంతో అనుభవం ఉన్న మీరు కూడా ఇలాంటి పరిస్థితి ని రానివ్వరనే ఆశ నాకుంది. దయచేసి 'ఏక్ పోలీస్' మీద వేగంగా ఒక కమిటీ వేయండి. ఇప్పుడున్న కన్వర్షన్ సిస్టం అంతగా ఫలితాలు ఇస్తున్నట్లు లేదు. అప్పటి తరానికి ఈ తరానికి చాలా తేడాలున్నాయి.. గమనించగలరు అని డీజీపీకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.

## శరద్‌పవార్ పార్టీకి షాక్.. గడియారం గుర్తు అజిత్ పవార్ ఎన్సీపీదేనని వెల్లడి



**శాసనసభ / న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ దేశ సర్వోన్నత న్యాయస్థానంలో శరద్‌పవార్ నేతృత్వంలోని పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. గడియారం గుర్తు తమకే కేటాయించాలంటూ శరద్‌పవార్ పార్టీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.గురువారం దీనిపై విచారించిన న్యాయస్థానం భారీ షాకిచ్చింది. గడియారం గుర్తు అజిత్ పవార్‌కు చెందిన ఎన్సీపీకే కొనసాగించాలని న్యాయస్థానం తేల్చింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఎన్నికలు ముగిసే వరకు తమ ఆదేశాలను ఉల్లంఘించబోమని చెబుతూ నవంబర్ 6లోగా హామీ పత్రాన్ని దాఖలు చేయాలని అజిత్ వర్గాన్ని ధర్మాసనం ఆదేశించింది.అజిత్ పవార్ వర్గం గత ఆదేశాలకు కట్టుబడి ఉండాలని, శరద్ పవార్ వర్గానికి నష్టం వాటిల్లకుండా చిహ్నాన్ని ఉపయోగించాలని తెలిపింది. ఈ విషయంలో కోర్టు ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, ఒకవేళ తమ ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలితే సుమోటోగా స్వీకరించి చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.2023లో అజిత్ పవార్ ఎన్సీపీలో తిరుగుబాటు చేసి అధికార మహాయుతి కూటమిలో చేరారు. పార్టీలో చీలిక తర్వాత అజిత్ పవార్ నేతృత్వంలోని వర్గాన్నే అసలైన ఎన్సీపీగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. అంతేకాకుండా ఆ పార్టీ జెండా, ఎన్నికల గుర్తు గడియారంను కూడా వారికే కేటాయించింది. తాజాగా మరోసారి న్యాయస్థానం కూడా స్పష్టం చేసింది.మహారాష్ట్రలో ఇండియా కూటమి, ఎన్డీఏ కూటమి హోరాహోరీగా తలపడుతున్నాయి. మరోసారి అధికారం కోసం ఎన్డీఏ కూటమి, అధికారం దక్కించుకోవాలని ఇండియా కూటమి ప్రయత్నిస్తున్నాయి. ఇక్కడ నవంబర్ 20న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు మాత్రం నవంబర్ 23న విడుదల కానున్నాయి.

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867
తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
శుక్రవారం 25 అక్టోబర్ - 2024



## సడెన్‌గా ఇలా షాకి చ్చావేంటి అనుష్క ?

స్టార్ హీరోయిన్ అనుష్క గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. నాగార్జునతో కలిసి సూపర్ సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. కెరీర్ మొదట్లో గ్లామర్ పాత్రలకే పరిమితమైంది.కోడి రామకృష్ణ దర్శకత్వంలో అరుంధతి సినిమాతో తన నటవిశ్వరూపాన్ని చూపించి.. స్టార్ స్టేటస్ అందుకుంది. అప్పటి నుంచి అనుష్కను జేజమ్మగా పిలవడం మొదలుపెట్టారు. ఇటీవల కాలంలో సినిమాలు చేయడం బాగా తగ్గించేసింది. గత ఏడాది నవీన్ పొలిశెట్టితో కలిసి 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చి సూపర్ హిట్ అందుకుంది. ఇక ఆ తర్వాత మరో సినిమా చేయలేదు. బాహుబలి తర్వాత ఆమె చాలా సెలెక్టివ్ గా సినిమాలు చేస్తోంది. ఇటీవల మళయాళంలో మొదటి సినిమాకి ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాన్ ఇండియా రేంజ్ లో ఈ మూవీ తెరకెక్కింది. జయసూర్య ఈ చిత్రంలో మెయిన్ లీడ్ లో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ మూవీ షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. భారీ బడ్జెట్ తో ఈ సినిమా తెరకెక్కింది. 'కథనాల్ – ది వైల్డ్ సోర్సరర్' అనే టైటిల్ తో ఈ మూవీ తెరకెక్కింది. హర్రర్ ఫాంటసీ థ్రిల్లర్ జోనర్ లో రోజిన్ థామస్ దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధమవుతోంది.సినిమాల సంఖ్య తగ్గించే సరికి ఆమె పెళ్లి చేసేసుకుందని అంతా భావిస్తున్నారు. కానీ అలాంటి షాకింగ్ వార్తలు మాత్రం జేజమ్మ చెప్పడం లేదు. ఇప్పటికే పలుసార్లు అనుష్క పెళ్లి ప్రస్తావనలు వచ్చాయి. ప్రభాస్ తో అంటూ, ఫారిన్‌లో ఉన్న పారిశ్రామికవేత్తతో అంటూ వార్తలు వస్తూనే ఉన్నాయి. కానీ అనుష్క నా కెరీర్ ఇంకా పూర్తి కాలేదంటూ వరుస సినిమాలకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. క్రిష్‌తో ఘాటి అనే సినిమా చేస్తున్నట్లుగా వార్తలు అయితే వినిపిస్తున్నాయి కానీ.. అధికారిక ప్రకటన అయితే లేదు. కానీ ఇప్పుడు ఒకటి కాదు.. అనుష్క రెండు సినిమాలు పూర్తి చేసిందనేలా సడెన్‌గా షాకింగ్ వార్త చక్కర్లు కొడుతోంది. ఈ వార్తతో అనుష్క ఫ్యాన్స్ మాత్రం పిచ్చ హ్యాపీగా ఉన్నారు. ఇక అనుష్క మలయాళంలో కథనార్ అనే మూవీతో పాటు క్రిష్ దర్శకత్వంలో ఘాటి అనే చిత్రాలను అనుష్క పూర్తి చేసిందట. ఈ రెండు సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానున్నట్లు తెలుస్తోంది. ఏదయితేనేం ఆఫ్టర్ లాంగ్ టైమ్.. అనుష్క సినిమాలకు సంబంధించి ఇలాంటి వార్త రావడం ప్రేక్షకులకు కూడా సంతోషానిస్తున్నది.

## రజనీకాంత్ హీరో - చిరంజీవి విలన్ - సూపర్ స్టార్స్ కాంబోలో వచ్చిన తెలుగు మూవీ ఏదో తెలుసా



రజనీకాంత్ మరియు చిరంజీవి అనేవి దక్షిణాది సినిమా పరిశ్రమను చాలాకాలంగా నడిపిస్తున్న రెండు అగ్ర కథానాయకులు కోలీవుడ్‌లో రజనీకాంత్ అగ్రతరం నటుడిగా కొనసాగుతున్నప్పుడు టాలీవుడ్‌కు చిరంజీవి ఒక ప్రధాన శక్తిగా నిలుస్తున్నారు చిరంజీవి మరియు రజనీకాంత్ కలిసి ఎన్నో సూపర్ హిట్ సినిమాలు తెరకెక్కించి తెలుగు మరియు తమిళ భాషల్లో అనేక రికార్డులను బ్రేక్ చేశారు వీరు చిన్న సినిమాల ద్వారా కెరీర్ ప్రారంభించి స్వయంకృషితో సూపర్‌స్టార్స్‌గా ఎదిగారు.రజనీకాంత్ మరియు చిరంజీవి కలిసి మొదట రెండు సినిమాలు చేశాయి కానీ అవి ప్రేక్షకులను నిరాశ పరిచాయి 'కాళి' సినిమా వీరి కాంబినేషన్‌లో వచ్చిన మొదటి చిత్రం ఇది ఒక యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మలయాళ దర్శకుడు ఐవీ శశి దర్శకత్వం వహించిన చిత్రం ఈ చిత్రం తెలుగు మరియు తమిళంలో ఒకే సమయంలో విడుదలైనప్పటికీ అది పెద్ద విజయాన్ని సాధించలేక పోయింది దీని తర్వాత 'రాణువ వీరన్' అనే మరో చిత్రంలో రజనీకాంత్ హీరోగా చిరంజీవి విలన్‌గా నటించారు తెలుగులో 'బందిపోటు సింహం' పేరుతో డబ్ చేయబడిన ఈ సినిమా చిరంజీవి తన విలన్ పాత్రలో అభిమానులను ఆకట్టుకోవడంతో పాటు శ్రీదేవి కూడా హీరోయిన్‌గా కనిపించింది.

## పుష్ప 2 రిలీజ్ డేట్ ను ప్రకటించిన మేకర్స్..ఇక తగ్గేదేలే




అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న 'పుష్ప–2' చిత్రం అధికారిక విడుదల తేదీని ప్రకటించింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తామని అర్థం చేసుకున్నారు.మొదట ఈ సినిమా డిసెంబర్ 6న విడుదల చేయాలని భావించినా, ఇప్పుడు ఒక రోజు ముందుగా విడుదల చేయనున్నట్లు తెలిపారు.'పుష్ప' ముందు భాగం బ్లాక్బస్టర్ హిట్ కావడంతో, అభిమానుల్లో ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లు అర్జున్ పాత్ర, కథ మరియు మ్యూజిక్ పై అభిమానులలో ఎంతో ఆసక్తి ఉంది. ఈ చిత్రాన్ని ఫస్ట్ పార్ట్ నుంచి ఎక్కువగా ప్రొడక్షన్ విలువలు, సాంకేతికతతో రూపొందిస్తున్నారని అంటున్నారు.

## షాకింగ్: లవ్ రెడ్డి నటుడిపై ప్రేక్షకురాలి దాడి



హైదరాబాద్ లో ఒక షాకింగ్ సంఘటన చోటు చేసుకుంది. థియేటర్స్ విజిట్ కు వెళ్లిన "లవ్ రెడ్డి" చిత్రబృందంలోని నటుడిపై ఓ ప్రేక్షకురాలు దాడికి పాల్పడిన ఘటన హైదరాబాద్ నిజాంపేట జీపీఆర్ మాల్ మల్టీప్లెక్స్ లో చోటు చేసుకుంది.ఈ సినిమా క్లైమాక్స్ చూసి ఎమోషనల్ అయిన ఆ ప్రేక్షకురాలు తండ్రి పాత్రను పోషించిన ఎన్ టీ రామస్వామి అనే నటుడు నిజంగానే ఆ ప్రేమ జంటను విడిదీశాడని అనుకుని కోపంతో తిడుతూ దాడి చేసినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో ఆశ్చర్యపోయిన హీరో అంజన్ రామచంద్ర, హీరోయిన్ శ్రావణి, దర్శకుడు స్మరణ్ రెడ్డి, ఇతర టీమ్ మెంబర్స్ ఆ మహిళను అడ్డుకుని ఆమెకు నచ్చజెప్పారు. కన్నడ సినీ పరిశ్రమకు ఎన్ టీ రామస్వామి తండ్రి పాత్రలో నటించాడని, అతను సినిమాలో చూపించినట్లు చెడ్డవాడు కాదని మహిళకు చెప్పి అక్కడి నుంచి పంపించివేశారు. ఈ నెల 18న థియేటర్స్ లోకి వచ్చిన "లవ్ రెడ్డి" సినిమాకు ప్రేక్షకుల నుంచి సూపర్ హిట్ టాక్ వచ్చింది. ఎమోషనల్ ప్రేమకథగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోందీ సినిమా.

## చీరలో శోభితా ధూళిపాలా



కాబోయే అక్కినేని నాగ చైతన్య శ్రీమతి మరియు నటి శోభితా ధూళిపాళ, మనీష్ మల్హోత్రా ప్రఖ్యాత దీపావళి వేడుకలో ఆకర్షణీయంగా కనిపించారు. చిక్ బ్లూ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో జతచేయబడిన కలకాలం బూడిద రంగు చీరలో నటి చక్కదనం మరియు అధునాతనతను వెదజల్లింది.చీర యొక్క సూక్ష్మమైన డ్రేపింగ్ శోభిత యొక్క సొగసైన ఆకృతిని పూర్తి చేసాయి. నీలిరంగు స్లీవ్‌లెస్ బ్లౌజ్ సంప్రదాయం మరియు ఆధునికత మధ్య శ్రావ్యమైన సమతుల్యతను సృష్టించి, సమకాలీన నైపుణ్యాన్ని జోడించింది. నాజూకైన వెండి అలంకారాలతో అలంకరింపబడిన శోభిత కాలాతీత అందం పూర్తిగా కనువిందు చేసింది. ఆమె వదులుగా, విరజిమ్మే జుట్టు మరియు సరళమైన ఇంకా సొగసైన బిందీ రూపాన్ని పూర్తి చేసింది, తక్కువ గ్లామర్ చిత్రాన్ని సృష్టించింది. ఈవెంట్‌లో నటి ప్రదర్శన నిస్సందేహంగా శాశ్వతమైన ముద్రను మిగిల్చింది. ఆమె స్టైల్ ఐకాన్‌గా ఆమె స్థానాన్ని మరింత పటిష్టం చేసింది.




## సంక్రాంతి రేసు నుంచి తప్పుకుంటున్న స్టార్ హీరోలు. పోటీకి సిద్ధం అంటున్న యంగ్ హీరోలు.

తెలుగు సినిమా ఇండస్ట్రీలో సంక్రాంతి ఫెస్టివల్ ను బేస్ చేసుకొని చాలా సినిమాలు రిలీజ్ కి రెడీ అవుతూ ఉంటాయి. ఇక 2025 సంక్రాంతి కానుకగా బరిలోకి దిగే సినిమాల విషయంలో చాలా రోజుల నుంచి చాలా కన్ఫ్యూజన్స్ అయితే ఉన్నాయి.
మొత్తానికైతే రామ్ చరణ్ జనవరి 10వ తేదీన తన గేమ్ చేంజర్ సినిమాతో సంక్రాంతి బరిలో నిలుస్తున్నట్టుగా అఫీషియల్ గా అనౌన్స్ చేశాడు. ఇక దాంతో విశ్వంభర సినిమాను చిరంజీవి పోస్ట్ పోన్ చేసుకున్న విషయం కూడా మనకు తెలిసిందే ఇక ఇది ఇలా ఉంటే బాలయ్య బాబు, బాబీ డైరెక్షన్ లో వస్తున్న ఎన్ బి కే 109 సినిమాని కూడా సంక్రాంతి బరిలో నిలపడానికి సిద్ధమవుతున్నారు. ఇక ప్రస్తుతానికైతే సంక్రాంతి రేసులో ఈ రెండు పెద్ద సినిమాలు ఉండడం విశేషం కార్తికేయ 2 సినిమా తో మంచి గుర్తింపును సంపాదించుకున్న చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా వస్తున్న తండేల్ సినిమా కూడా సంక్రాంతి రేసులో ఉంటుందని ప్రచారం చేసినప్పటికి ప్రస్తుతం అయితే ఆ సినిమాని సంక్రాంతి బరి నుంచి తప్పించినట్టుగా తెలుస్తోంది. మరి కారణం ఏంటి అనే విషయం పక్కన పెడితే ఇప్పుడు సంక్రాంతి రేస్ లో ఆ సినిమా లేకపోవడం విశేషం ఇక దీంతోపాటుగా వెంకటేష్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వస్తున్న సినిమా కూడా సంక్రాంతికి రిలీజ్ అవుతుంది అంటూ చాలా రోజుల నుంచి చాలా వార్తలైతే వినిపిస్తున్నాయి. కానీ ఆ సినిమా కూడా అనుకోని పరిస్థితుల్లో పోస్ట్ పోన్ చేసుకోవాల్సి వచ్చింది. ఇక గేమ్ చేంజర్ సినిమా ప్రొడ్యూసర్ దిల్ రాజు కావడంతో దాదాపు 80% థియేటర్ తన అధీనంలోనే ఉన్నాయి. కాబట్టి మిగతా హీరోలకు పెద్దగా థియేటర్లు దొరక్కపోవచ్చు అనే ఉద్దేశ్యంతోనే వాళ్ళు సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్నట్టుగా కూడా తెలుస్తోంది.కానీ బాలయ్య బాబు మాత్రం ముందుగా ఫిక్స్ అయినట్టుగా సంక్రాంతికి తన సినిమాను బరి లో నిలపాలని చూస్తున్నాడు. ఇక స్టార్ హీరోల సినిమాలు సైడ్ అయిపోవడంతో యంగ్ హీరో అయిన సందీప్ కిషన్ త్రినాధ్ రావు నక్కిన దర్శకత్వంలో చేస్తున్న 'మజాకా' సినిమా సంక్రాంతి రేసులో నిలవబోతున్నట్టుగా వార్తలైతే వస్తున్నాయి. ఇక ఔట్ అండ్ ఔట్ కమర్షియల్ ఎంటర్టైనర్స్ ని తెరకెక్కించే త్రినాధ్ రావు నక్కిన డైరెక్షన్ లో సందీప్ కిషన్ చేస్తున్న ఈ సినిమా కూడా భారీ సక్సెస్ ని సాధిస్తుందంటూ సినిమా యూనిట్ చాలా మంచి కాన్ఫిడెంట్ ను అయితే వ్యక్తం చేస్తున్నారు.ఇక చిన్న సినిమా అయినా కూడా పాజిటివ్ టాక్ వచ్చిందంటే సినిమాకి మంచి బజ్ క్రియేట్ అవుతుంది కాబట్టి సందీప్ కిషన్ ఈ సినిమా మీద తన పూర్తి నమ్మకాన్ని ఉంచి దీనిని సంక్రాంతి రేసులో నిలపడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తోంది. చూడాలి మరి ఈ సినిమాలే కాకుండా సంక్రాంతి రేసులో మరిన్ని సినిమాలు నిలుస్తాయా లేదా అనేది...

## డేంజర్ జోన్‌లో భారత్..దూసుకొచ్చిన దక్షిణాఫ్రికా!



వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్ రేసు ప్రస్తుతం రసవత్తరంగా మారింది భారత్‌పై న్యూజిలాండ్ బంగ్లాదేశ్‌పై దక్షిణాఫ్రికా సాధించిన విజయాలతో పాయింట్ల పట్టికలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి టీమిండియా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ వారి విజయశాతం గణనీయంగా తగ్గిపోయింది దాదాపు 6% విజయశాతం కోల్పోయిన భారత్ పరిస్థితి ఇప్పుడు సవాళ్లతో కూడుకుంది దక్షిణాఫ్రికా బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించడం ఆసియాలో దశాబ్దం తర్వాత టెస్టుల్లో విజయం నమోదు చేయడం వారిని నాల్గవ స్థానానికి ఎగబాకేలా చేసింది. 47.62% విజయశాతంతో ఫైనల్ బెర్తు అవకాశాలను మెరుగుపర్చుకున్న సఫారీలు తమ మిగిలిన మ్యాచ్‌లలో కూడా గెలిచి టేబుల్ టాపర్‌గా నిలిచే అవకాశాన్ని ఆశిస్తున్నారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆసీస్ (62.50%) రెండో స్థానంలో శ్రీలంక (55.56%) మూడవ స్థానంలో ఉన్నప్పటికీ దక్షిణాఫ్రికా తమ రాబోయే టెస్టు మ్యాచ్‌ల్లో శక్తివంతమైన పోటీగా మారింది.

## అదే డీఎస్పీ సిరాజ్ కొంపముంచింది..!



టీమిండియా స్టార్ పేసర్ మరియు తెలంగాణ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్ భారత జట్టులోంచి స్థానాన్ని కోల్పోయాడు.పుణె వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌కు టీమ్ మేనేజ్ మెంట్ సిరాజ్‌ను తుది జట్టులోకి తీసుకోలేదు బెంగళూరులో జరిగిన తొలి టెస్ట్‌లో ఆయన ప్రదర్శన తీవ్రంగా విఫలమైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు సిరాజ్ ఆ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు మాత్రమే తీయగా రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం వికెట్ లేకుండానే ముగించాడు ఈ కారణంగా సిరాజ్ స్థానంలో యువ పేసర్ ఆకాశ్‌దీప్‌కు అవకాశాన్ని కల్పించారు ఈ మార్పు మాత్రం ఆశ్చర్యకరం కాదు ఎందుకంటే ఇటీవల సొంత గడ్డపై సిరాజ్ ప్రదర్శన నిరాశకు గురిచేసింది ఈ ఏడాది సిరాజ్ తన ఫామ్‌ను పూర్తిగా కోల్పోయినట్లు కనిపిస్తుంది టెస్ట్ ఫార్మాట్‌లో అతని గణాంకాలు కూడా నిరాశపరిచాయి సిరాజ్ ప్రదర్శనలో పతనం కనిపించడానికి ప్రధాన కారణం అతను దేశవాళీ క్రికెట్ ఆడకపోవడమేనని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.తరచుగా సిరాజ్‌కు అంతర్జాతీయ క్రికెట్ నుంచి విశ్రాంతి ఇవ్వడం దేశవాళీ మ్యాచ్‌లు ఆడకపోవడంతో అతను తన రిథమ్ కోల్పోయాడని విమర్శకులు అంటున్నారు ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టెస్ట్‌ల సిరీస్‌లోనూ సిరాజ్ పెద్దగా ప్రభావం చూపలేదు నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం ఆరు వికెట్లు మాత్రమే తీసిన సిరాజ్ సొంత గడ్డ అయిన హైదరాబాద్ వేదికలో కూడా వికెట్ల వేటలో వెనుకబడ్డాడు వైజాగ్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌కు విశ్రాంతి తీసుకున్న సిరాజ్ మళ్లీ రాంచీ టెస్ట్‌లో కేవలం రెండు వికెట్లు మాత్రమే తీసాడు ధర్మశాల టెస్ట్‌లో మాత్రం వికెట్ లేకుండానే తన స్పెల్‌ను ముగించాడు బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌లోనూ సిరాజ్ నిరాశపరిచాడు ఇదిలా ఉంటే ఆకాశ్‌దీప్ దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనతో టీమ్‌ఇండియాలోకి వచ్చాడు ఇటీవల ముగిసిన దులీప్ ట్రోఫీలో 9 వికెట్లు సాధించిన ఆకాశ్‌దీప్ బంగ్లాదేశ్ సిరీస్‌లోనూ తన ప్రతిభను చూపి జట్టులో చోటు దక్కించుకున్నాడు.

## కివీస్‌తో రెండో టెస్టు..అశ్విన్ ఖాతాలో అరుదైన రికార్డ్



భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరో అరుదైన మైలురాయిని అధిగమించాడు అశ్విన్ ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ లో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా గుర్తింపు పొందాడు పూణేలోని ఎంసీఏ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో రెండు కీలక వికెట్లు పడగొట్టి ఈ ఘనతను సాధించాడు ఈ ఫీట్‌లో ముఖ్యంగా న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లాథమ్‌ను అవుట్ చేయడం కీలకం అయింది ప్రస్తుతం అశ్విన్ ఖాతాలో 74 ఇన్నింగ్స్‌లలో 188 వికెట్లు ఉన్నాయి ఈ రికార్డుతో అతను ఆసీస్ బౌలర్ నాథన్ లియోన్ (187 వికెట్లు)ను అధిగమించి ముందుకువచ్చాడు.ఈ జాబితాలో ప్యాట్ కమిన్స్ (175 వికెట్లు), మిచెల్ స్టార్క్ (147 వికెట్లు), స్టువర్ట్ బ్రాడ్ (134 వికెట్లు) తదితరులు ఉన్నారు.అశ్విన్ 188 వికెట్లు సాధించడంలో విశేషం ఏమిటంటే లియోన్ కంటే 2,500 బంతులు తక్కువగా బౌలింగ్ చేస్తూ ఈ రికార్డును నెలకొల్పాడు లియోన్ 78 ఇన్నింగ్స్‌లలో 26.70 సగటుతో 187 వికెట్లు తీయగా అశ్విన్ 20.75 సగటుతో 74 ఇన్నింగ్స్‌లలోనే 188 వికెట్లు సాధించడం అతని ప్రతిభకు నిదర్శనం అశ్విన్ 11 సార్లు ఐదు వికెట్లు తీయడం కూడా అతని కాస్టింగ్‌ను మరింత ప్రత్యేకం చేస్తుంది. డబ్ల్యూటీసీ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో అశ్విన్ అగ్రగామిగా నిలవడం భారత జట్టు ఖ్యాతిని మరింత పెంచింది.

రవిచంద్రన్ అశ్విన్ (భారతదేశం) – 188 వికెట్లు
నాథన్ లియోన్ (ఆస్ట్రేలియా) – 187 వికెట్లు
ప్యాట్ కమిన్స్ (ఆస్ట్రేలియా) – 175 వికెట్లు
మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా) – 147 వికెట్లు
స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లాండ్) – 134 వికెట్లు

అశ్విన్ మరిన్ని విజయాలు సాధించేందుకు ఈ కొత్త రికార్డు ప్రేరణగా నిలవనుంది.

## ఐపీఎల్ మెగా వేలంపై రిషబ్ పంత్ కీలక నిర్ణయం?.. తెరపైకి ఆసక్తికర కథనం



ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌పై కెప్టెన్ రిషబ్ పంత్ దృష్టి మరల్చుతున్నాడా? తాజా కథనాలు మాత్రం ఈ మేరకు సంకేతాలు ఇస్తున్నాయి పంత్ తన కెరీర్ మొత్తం ఢిల్లీ ఫ్రాంచైజీకి సేవలందించిన తరువాత 2025లో జరగబోయే ఐపీఎల్ మెగా వేలంలోకి ప్రవేశించాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో ప్రచురితమైన సమాచారం ప్రకారం పంత్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను వీడాలని భావిస్తున్నట్టు సమాచారం ఉంది ఈ స్టార్ ప్లేయర్‌పై పలు ఫ్రాంచైజీలు ఆసక్తిని చూపిస్తున్నాయి ప్రత్యేకంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు పంత్‌ను కొనుగోలు చేసేందుకు ముందున్నట్టు తెలుస్తోంది ఈ జాబితాలో లక్నో సూపర్ జెయింట్స్ పంజాబ్ కింగ్స్ వంటి జట్లు కూడా ఉన్నాయని చెప్పబడుతోంది.




తెలంగాణ
# శాసనసభ
తెలుగు దినపత్రిక

# జిల్లా అనుబంధం

|| శుక్రవారం 25 అక్టోబర్ - 2024 || పేజీలు : 4

## బాణసంచా విక్రయించే దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి : జీహెచ్ఎంసీ కమిషనర్



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** దీపావళి పండగకు బాణసంచా విక్రయించే దుకాణాదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు.రిటైల్ దుకాణాలకు రూ.11 వేలు, హెూల్ సేల్ దుకాణాలకు రూ.66 వేలు లైసెన్స్ ఫీజు నిర్ణయించినట్లు కమిషనర్ ప్రకటించారు. బాణ సంచా దుకాణాలను ఫుట్‌పాత్‌లు, జనావాసాల మధ్య ఏర్పాటు చేయవద్దని సూచించారు. అదేవిధంగా స్టాల్స్‌కు ఏర్పాటు చేసే విద్యుత్‌కు సంబంధించి నాణ్యమైన పరికరాలు ఉపయోగించాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే అందుకు దుకాణాల యజమానులే బాధ్యత వహించాలని కమిషనర్ తెలిపారు. కాలనీలు, బస్తీలకు దూరంగా మైదానాలు, పెద్ద హాల్స్‌లో తగిన ఫైర్ సేఫ్టీతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి స్టాల్ వద్ద చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారంతా నిర్ణీత ఫీజును చెల్లించి జీహెచ్ఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు. తాత్కాలిక ట్రేడ్ ఐడెంటిఫికేషన్ నంబర్ కోసం సిటిజన్ సర్వీస్ సెంటర్, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ www.ghmc.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన ఉత్తర్వులు, న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని సూచించారు.కొన్ని టపాసుల అమ్మకాలపై నిషేధం ఉందని, వాటి అమ్మకాలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాదారుల తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## రాష్ట్ర ప్రభుత్వం సహకరించకున్నా యాదాద్రికి MMTS సర్వీసు పొడిగింపు: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో రాష్ట్ర ఎంపీల సమావేశం అనంతరం రైల్ నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్‌ను పెంచామన్నారు.దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లు ఉన్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మరిన్ని తీసుకొస్తామన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు చేస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామ న్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్‌కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని




పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసును పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.కార్యక్రమంలో ఎంపీలు సురేష్‌రెడ్డి, కావ్య, డీకే అరుణ,రఘునందన్‌రావు పాల్గొన్నారు. పలు సమస్యలను వారు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈదుల నాగులపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ రఘునందన్ రావు కోరారు.కొల్లూరు,ఈదుల నాగుల పల్లి రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయాలన్నారు. జర్నలిస్టులు, దివ్యాంగులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరారు. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు.

## గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు పురుగుల

### - మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**యాచారం, అక్టోబర్ 24:( శాసనసభ న్యూస్) :** ఇంటి అనుమతి ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం పంచాయతీ కార్యాలయంలోనే పురుగుల మందు తాగిన వైనం ఇంటి అనుమతి ఆన్ లైన్ ధ్రువపత్రాన్ని పంచా యతీ కార్యదర్శి ఇవ్వడంలేదని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురు గుల మందు తాగి పంచాయతీ కార్యాలయంలోనే ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధి లోని చౌదర్పల్లి గ్రామంలో చోట చేసుకుంది.స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. మండలంలోని



చౌదర్పల్లి గ్రామానికి చెందిన ముక్కెరి మధుసూదన్ (38) గ్రామంలో నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. తన ఇంటిపై బ్యాంకు లోన్ తీసుకోవాలని తీసుకోవడానికి పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించాడు. డాక్యుమెంట్ ప్రకారం ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని అడుగగా, ఇంటి స్థలం ఆధారంగా నిబంధనల ప్రకారం ఇస్తానని పంచాయతీ కార్యదర్శి బదులిచ్చారు. మొత్తం స్థలం కాకుండా మెట్ల వరకే(సెట్ బ్యాక్) ఇస్తామని ఆమె చెప్పారు. దీంతో ఇంటి స్థలం తక్కువ రావ డంతో.. తనకు డాక్యుమెంట్ ప్రకారం ఇవ్వాలని ఆయన అధికారులతో వాదించాడు. ఇలా ఆరునెలలుగా సర్టిఫికెట్ కోసం పంచా యతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నడు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి . తనకు ఇంటి ఆన్లైన్ సర్టిఫికెట్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని డిమాండ్ చేశాడు. ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని కార్యదర్శి తో సర్టిఫికెట్ ఇస్తవా ఇవ్వవా అంటూ గొడవ చేశాడు. నిబంధనలు ఉల్లంఘించి ఇవ్వనని కార్యదర్శి తేల్చిచెప్పడంతో చివరకు విసుగుచెందిన మధుసూదన్ తనతో తెచ్చుకున్న పురుగుల మందును అందరూ చూస్తుండగానే తాగాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు యాచారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు తరలిం చారు. అక్కడ అతడికి వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. అనం తరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతున్నాడు.

## మూసీ నిర్వాసితులకు 800 ఎకరాలు

**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** మూసీ నిర్వాసితులకు న్యాయం చేయడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.వారిని ఒప్పించాకే ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఒక్కొక్కరికి 150-200 గజాల స్థలాన్ని ఇవ్వాలని సర్కార్ యోచిస్తోంది. పట్టుదలతో ప్రభుత్వం.. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఎలాగైన సరే మొదలు పెట్టాలని చూస్తోంది. ఇందుకు మూసీ గర్భంలో ఉంటున్న వారితో పాటు 50 మీటర్ల బఫర్ జోన్‌లోని వారినీ అక్కడి నుంచి ఖాళీ చేయించాల్సి ఉంది. మూసీ గర్భంలో ఉన్న 1600 మందిలో మూడొంతుల మంది ఖాళీ చేసి ప్రభుత్వం ఇస్తున్న రెండు పడకల ఇళ్లలోకి వెళ్లడానికి అంగీకరించారు. ఇప్పటికే 250 మంది వెళ్లిపోయారు. బఫర్ జోన్‌లోని వారు మాత్రం తమకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మొత్తం చాలాదని ఖాళీ చేయడానికి



ససేమిరా అంటున్నారు.ఇప్పుడు స్థలాలు ఎక్కడున్నాయనే దానిపై అన్వేషణ మొదలు పెట్టారు. ఓఆర్ఆర్ సమీపంలో ప్రభుత్వ భూములుండటంతో.. వాటి లెక్కలు తీస్తున్నారు. ఎక్కడ ఎన్ని ఎకరాలు ఉందో కొద్ది రోజుల్లోనే మంత్రికి నివేదిక సమర్పిస్తామని ఓ అధికారి తెలిపారు. రెండు, మూడుచోట్లనైనా సేకరించి లేఅవుట్లు వేసి సకల సదుపాయాలు కల్పించాలని భావిస్తోంది. అక్కడ గజం 50 వేలకు పైబడి ధర పలికే అవకాశం ఉండటంతో ఈ ప్రతిపాదనకు బఫర్ జోన్ లోని నిర్వాసితులు అంగీకరిస్తారని అనుకుంటున్నారు.

## ఎమ్.పి. నిధుల నుంచి ఇరవై ఎనిమిది లైట్లు ఇచ్చిన - ఎమ్.పి. చామల కిరణ్ కుమార్ రెడ్డి



**చండూర్ అక్టోబర్ 24 శాసనసభ న్యూస్ :** భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చండూరు మండలం గుండ్లపల్లి గ్రామానికి ఎంపీ నిధుల నుండి 28 లైట్లు ఇవ్వడం జరిగింది. ఈ లైటులని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామానికి ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు. కురుపాటి గణేష్. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ కమిటీ మెంబర్ కాసాల పాండురంగారెడ్డి.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వందనపు నరేందర్.. మహేశ్వరం శేఖర్. అనిమల్ల రామలింగం. యామన్న తదితరులు పాల్గొని మరిన్ని ఎంపీ గారి నిధులు గ్రామానికి ఇవ్వాలని మా గ్రామం ఎంతో అభివృద్ధి చేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం

**చండూర్ అక్టోబర్ 24 శాసనసభ న్యూస్) :** చండూరు మండల రైతు సోదరులకు తెలియచేయునది ఏమనగా రైతు సేవా సహకార సంఘం చండూరు ఆద్వర్యంలో మండలం లో (5 ) కేంద్రాలు 1.పి.పి. సి చండూరు –దొడ్డు రకం(అంగడిపేట ) 2.పి.పి.సి చండూరు – సన్నరకం (సంఘ ఆవరణ) 3.పి.పి.సి కొండాపురం –దొడ్డురకం 4.పి.పి.సి తెరటుపల్లి – దొడ్డు రకం 5.పి.పి. సి కస్తాల – దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు గౌరవ అధ్యక్షులు & డి.సి.సి.బి శ్రీమతి కోడి సుష్మా వెంకన్న & RDO D%.సుబ్రమణ్యం చే ప్రారంభోత్సవం చేయనైనది కావున రైతులు తమ యొక్క వడ్లను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గ్రేడ్ – A కు 2302/– & గ్రేడ్ – B కు 2300/– రూపాయలు సన్న రకం వడ్లు పండించిన రైతులకు ప్రోతహంగా 500/– రూపాయలు బొనస్ ప్రకటించడం జరిగినది కావున మండల కేంద్రం లోని రైతులు తమ వడ్లను దళారులకు అమ్మి మోసపోవద్దు ప్రభ్యుత్వం తెలిపిన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మద్దతు ధర పొందగలరు అలానే రైతులు వడ్లను కేంద్రానికి తీసుకవచ్చేటప్పుడు రైతు ఆధార్ కార్డు,బ్యాంక్ పాసు పుస్తకం,భూమి పాసుపుస్తకాలు ఒకే రైతువి కేంద్రం లో సమర్పించగలరు తేమ 17% లోపు ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు అలాగే రైతులు తమ ఆధార్ కార్డు కి ఫోన్ నెంబర్ తప్పకుండా లింక్ చేసుకొని ఉండాలి అదే విందంగా రైతులు తమ పంట నమోదు వరి అని ఉన్నదో లేదో అని తమ AEO దగ్గర



సరిచూసుకోగలరు ఇట్టి అవకాశాన్ని మండల రైతు సోదరులు సద్వినియోగం చేసుకోగలరని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమము లో MPDO పి.రాం రెడ్డి ,MRO దశరథ,A.O రేవతి,AEO నాగార్జున , సంఘ డైరెక్టర్లు గుండమల్ల శ్రీనివాస్, కట్ట భిక్షం,బోడ ఆంజనేయులు, మొగుదాల దశరథ,చింత శకుంతల,మిట్టపల్లి రాజు,డోలె నర్సాజీ,గిరి సత్తయ్య,అచ్చిన శ్రీనివాసులు,చెరుపల్లి ఆంజనేయులు, బాణవత్ ఘాసిరాం,దుబ్బాక రాములు,సంఘ సిబ్బంది, దోటి వెంకటేష్ యాదవ్,అనంత చంద్రశేఖర్,కారింగు రాముర్తి రైతులు & ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సి.ఎమ్. రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ - అనంత చంద్రశేఖర్ గౌడ్



**చండూర్ అక్టోబర్ 24 (శాసనసభ న్యూస్) :** గురువారం రోజున గౌరవ శాసనసభ్యులు మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 8 మంది లబ్దిదారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ అద్వర్యం లో మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ దొటి సుజాత వెంకటేష్ యాదవ్ ,కోడి శ్రీనివాసులు చేతుల మీదుగా 2,86,000 వచ్చిన చెక్కులను లబ్దిరులకు గెస్ట్ హౌస్ దగ్గర ఉదయం 11 గంటలకు అందించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో కారింగు రామూర్తి,సంకోజు బ్రహ్మం,పన్నాల లింగయ్య,మాస కృష్ణ,కలీల్,వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్.పి. నిధుల నుంచి యాభై ఆరు లైట్లు ఇవ్వడం జరిగింది - శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**చండూర్ అక్టోబర్ 24 (శాసనసభ న్యూస్) :** గురువారం రోజున చండూరు మున్సిపాలిటీ పరిదిలో గతంలో 10 వార్డులో వీధి దీపాలు వెలగడం జరిగింది. ఇంకా అవసరం అని మన శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి సమాచారం ఇవ్వగా మన పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీ నిధుల నుండి 56 వీధి దీపాలను అందించడం జరిగింది. చండూరు మున్సిపాలిటీ తరుపున ఎం. ఎల్ .ఏ. & ఎంపీ లకు చండూరు మున్సిపాలిటీ తరుపున మున్సిపల్ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్,వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్,కోడి శ్రీనివాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ సంజయ్, మాజీ సర్పంచ్ కల్మికొండ జనార్ధన్, నల్లగంటి మల్లేష్,కారింగు రామ్మూర్తి, భూతరాజు వేణు ,గుండూరి జనార్ధన్, అందించడం జరిగింది.



## నేడు మీట్ యువర్ యస్.పి కార్యక్రమం

### - శుక్రవారం చింతపల్లి పోలీస్ స్టేషన్లో అందుబాటులో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపిఎస్

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 24 :** ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజలవద్దకు వెళ్లి పరిష్కరించే దిశగా చింతపల్లి పోలీసు స్టేషన్లో శుక్రవారం ఉదయం 11.00 గంటలకు "మీట్ యువర్ యస్పి" కార్యక్రమాన్ని నిర్వహించానున్నారని జిల్లా ఎస్పి ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుల యొక్క ఫిర్యాదులను పోలీసు స్టేషన్లలోనే పరిశీలించి సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కావున మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యల గురించి ఎస్పిని స్వయంగా కలిసి దరఖాస్తులు సమర్పించేందుకు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ బీనమోని యాదయ్య తెలిపారు.

## నల్గొండ జిల్లా మాదిగ జె.ఎ.సి. మండలం, గ్రామ కమిటీల ఇంచార్జీ గా నియామకం - ఇర్గి.గురునాధం





**చండూర్ అక్టోబర్ 24 (శాసనసభ న్యూస్) :** నల్గొండ జిల్లా చండూర్ మండలం పరిధిలో బంగారి గడ్డ కు చెందిన ఇర్గి.గురునాధం. మాదిగ జె.ఎ.సి. నల్గొండ జిల్లా పట్టణ, మండలం, గ్రామ కమిటీల ఇంచార్జీ గా నియమితులయ్యారు. గురువారం రోజున మాదిగ జె.ఎ.సి. వ్యవస్థాపకులు పిడమర్తి రవి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఇర్గి. గురునాధం మాట్లాడుతూ నా పై నమ్మకంతో నన్ను నల్గొండ జిల్లా మాదిగ జె.ఎ.సి. కమిటీల ఇంచార్జీ గా నియమించినందుకుగాను మాదిగ జె.ఎ.సి. వ్యవస్థాపక డాక్టర్ పిడమర్తి రవి & మాదిగ జె.ఎ.సి. జిల్లా అధ్యక్షుడు కురుపాటి.సుదర్శన్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

# సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ చేయడం కృష్ణ మాదిగ కు ఇష్టం లేదు : పిడమర్తి రవి

దేవరకొండ అక్టోబర్ 24 శాసనసభ న్యూస్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలని పిడమర్తి రవి డిమాండ్ చేశారు.గురువారం దేవరకొండ నియోజకవర్గంలో మాదిగల అసెంబ్లీ నియోజకవర్గ సమ్మేళనం పట్టణంలోని ఐబి లో సమావేశం నిర్వహించారు,మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్చార్జి శెట్టిపల్లి చిరంజీవి యూత్ అధ్యక్షులు నాగిళ్ళ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పిడమర్తి రవి మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ చేయడం మందకృష్ణ కు ఇష్ట లేదు ఎందుకంటే మందకృష్ణ మాదిగ వర్గీకరణ బిజెపితో సాధించుకొని రాజకీయాల లబ్ది పొందాలని చూస్తున్నట్టుగా అనిపిస్తుంది. 1994లో ప్రారంభమైనటువంటి ఏబిసిడి ఉద్యమం ఇప్పటికి ఇప్పుడు ఉన్నటువంటి మాదిగ జనాభా కు చాలా తేడా ఉందని అందుకే తెలంగాణ రాష్ట్రంలో 12% రిజర్వేషన్ డిమాండ్ చేస్తుందని పిడమర్తి రవి అన్నారు,ఆంధ్రప్రదేశ్ లో బిజెపి టిడిపి జనసేన ఎంఆర్పిఎస్ కూటమిగా ఏర్పడి అధికారం వచ్చిన విషయం అందరికి తెలిసిందే ఎందుకు కృష్ణ మాదిగ చంద్రబాబునాయుడు పైన ఉద్యమం చేయడంలేదు అని పిడమర్తిరవి అన్నారు కృష్ణ మాదిగ సీఎం చంద్రబాబు అక్కడ వర్గీకరణ చేసి తెలంగాణ ముఖ్యమంత్రి పైన ఒత్తిడి తీసుకొస్తే బాగుండేది. అట్లా కాకుండా ఇప్పటికే వర్గీకరణ పైన నాలుగు అడుగులు ముందుకు వేసినటువంటి సీఎం రేవంత్ రెడ్డిని మాదిగ ద్రోహి అనడం సరైనది కాదు అని కృష్ణ మాదిగని డిమాండ్ చేశారు, ఇప్పటికైనా సీఎం చంద్రబాబును కలిసి వర్గీకరణ పై ఆంధ్రాలో నువ్వు ఎవరికి మద్దతు తెలిపినవో తెలుసు సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ ప్రకటన చేయడం ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘం వేయడం మాల మాదిగల మధ్య ఉద్యోగాలలో ఉన్న లెక్కని రాష్ట్ర ప్రభుత్వం అడగడం ఏక సభ్య కమిషన్ జడ్జిగా వేయడం ఇటువంటి చర్యలు మాదిగలకు ద్రోహం చేసినాడు, కృష్ణ మాదిగ ఎట్లా అనిపిస్తుందో నాకు అర్థం కావట్లేదని అన్నారు,ఏబిసిడి చేయాలని రేవంత్ రెడ్డి వర్గీకరణ చేయడం ఖాయమని



పిడమర్తి రవి అన్నారు చిత్తూరు లో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆంధ్రలో ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారిగా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది రాష్ట్రంలో వర్గీకరణ చట్టము భవిష్యత్తులో అమలు ఇవన్నీ జరుగుతాయి దేశవ్యాప్తంగా వర్గీకరణ పైన కృష్ణ మాదిగ ఎందుకు బిజెపి పైన మాట్లాడటం లేదో అర్థం చేసుకోవాల్సిందిగా కోరుతున్నా ఎంతసేపటికి ఉద్యమాలు బిజెపిని బలోపేతం చేయడానికి ఉండే తప్పించి నిజానికి వర్గీకరణ దేశవ్యాప్తంగా అమలు జరపాలని ఇప్పటికైనా కృష్ణ మాదిగ మాదిగ జాతి ప్రజల కోసం ఆంధ్రలో ఏబిసిడి కోసం దేశవ్యాప్తంగా వర్గీకరణ కోసం బిజెపి పైన ఒత్తిడి చేయాలని డిమాండ్ చేస్తా తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ జిల్లాల వర్గీకరణ చేయడం కోసం మాదిగ జేఏసీ విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తుందని కచ్చితంగా వర్గీకరణ సాధిస్తుందిన్నారు, ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు కూరుపాటి సుదర్శన్ మాదిగ,జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇరిగి గురునాథం. మాదిగ జేఏసీ దేవరకొండ యూత్ అధ్యక్షులు నాగిల్ల రవి , దేవరకొండ మాదిగ జేఏసీ అధ్యక్షులు సిహెచ్ చిరంజీవి, విజయ్, అనిల్,శివ,జగదీష్ శ్రీకాంత్,శీను,నరేష్, ప్రభాస్, కంబాలపల్లి శేఖర్, బుర్రి శ్రీకాంత్, వెంకటరత్నం, అంకూరి వెంకటయ్య భూషిపాక శ్రీను,తదితరులు పాల్గొన్నారు

## ఎమ్.పి. నిధుల నుంచి యాభై ఆరు లైట్లు ఇవ్వడం జరిగింది

– శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



చండూర్ అక్టోబర్ 24 (శాసనసభ న్యూస్) : గురువారం రోజున చండూరు మున్సిపాలిటీ పరిధిలో గతంలో 10 వార్డుల్లో వీధి దీపాలు వెలగడం జరిగింది. ఇంకా అవసరం అని మన శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి సమాచారం ఇవ్వగా మన పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీ నిధుల నుండి 56 వీధి దీపాలను అందించడం జరిగింది. చండూరు మున్సిపాలిటీ తరుపున ఎం. ఎల్ .ఏ. & ఎంపీ లకు చండూరు మున్సిపాలిటీ తరుపున మున్సిపల్ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్,వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్,కోడి శ్రీనివాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ సంజయ్, మాజీ సర్పంచ్ కల్లికొండ జనార్ధన్, నల్లగంటి మల్లేష్,కారింగు రామ్మూర్తి, భూతరాజు వేణు ,గుందూరి జనార్ధన్, అందించడం జరిగింది.

## అదనపు మెజిస్ట్రేట్ హోదాలో కేసు విచారించిన సీపీ సీవీ ఆనంద్






హైదరాబాద్/ శాసనసభ ప్రతినిధి : హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా.. ప్రజలను ఇబ్బంది పెట్టినా ఊరుకునేది లేదని సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు.పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ జిల్లా అదనపు మెజిస్ట్రేట్ హోదాలో కార్యనిర్వాహక కోర్టును నిర్వహించారు.హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పెట్టిన పిటిషన్‌ను విచారించారు. హుమాయున్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లోని సీసీ రోడ్డు ఘటన విషయంలో నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మజీద్ హుస్సేన్ కి, కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ మధ్య రాజకీయ వైరం ఉందని తెలిపారు. ఘటనలో భాగంగా శాంతిభద్రతలకు భంగం కలిగించినందుకు ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని చెప్పారు.ఈ క్రమంలో మజీద్ హుస్సేన్, ఫిరోజ్ ఖాన్ గ్రూపుల వాదనలు విన్నారు అదనపు ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సీపీ సీవీ ఆనంద్. రెచ్చగొట్టే కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఇద్దరు నేతలకు సూచించారు. ఇరువర్గాల ఘర్షణతో సమాజానికి చెడు జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనుల్లో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ ఆరోపించారు. దీంతో స్థానిక ఎంఐఎం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ కు స్థానిక నేతలు ఫోన్ చేశారు. వెంటనే ఎమ్మెల్యేతోపాటు భారీగా చేరుకున్న అనుచరులు ఫిరోజ్ ఖాన్, కాంగ్రెస్ శ్రేణులపైకి దూసుకెళ్లారు. దీంతో ఇరుపార్టీల నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఇరువర్గాలను శాంతింపజేసేందుకు ప్రయత్నించినా వెనక్కి తగ్గలేదు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## మన "గోడు" తీరాలంటేకోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాల్సిందే - మాదగోని వెంకన్న గౌడ్



చండూర్ అక్టోబర్ 24 (శాసనసభ న్యూస్) : ప్రభుత్వంలో ప్రాధాన్యత కలిగిన మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని చండూర్ లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షులుమాదగోని వెంకన్న గౌడ్ అన్నారు. గురువారం శాసన సభ ప్రతినిధి తో మాట్లాడుతూ హైదరాబాదుకు కూత వేటు దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గం తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు.గత ప్రభుత్వం ఉత్తర తెలంగాణాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి హైదరాబాద్ కు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలోఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి మంచి అనుభవం ఉన్న నాయకులు ఎన్నుకోబడ్డారు! ముఖ్యంగా కోమటిరెడ్డి బ్రదర్స్! ప్రభుత్వంలో వీళ్ళ మాట చెల్లుబాటు అవుతుంది కాబట్టి! నల్లగొండ జిల్లాలో బాగా వెనకబాటుకు గురైన మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఒక ప్రాంతం డెవలప్ కావాలంటే! రోడ్లు విశాలంగా ఉండాలి! మునుగోడు నియోజకవర్గ లో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి! మునుగోడు నియోజకవర్గంలోనే మోటార్ ఫీల్డ్ లో జీవిస్తున్న వాళ్లు నూటికి అరవై శాతం డైరెక్ట్ గా ఇన్ డైరెక్ట్ గా జీవిస్తున్న వాళ్ళు ఉన్నారు! వీళ్లను దృష్టిలో పెట్టుకొని విశాలమైన రోడ్ల నిర్మించి! కొన్ని కంపెనీలన్ని మునుగోడు నియోజకవర్గానికి తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. మునుగోడు నియోజకవర్గం నుండి రెండు రాజధానులు కలుపుతూ నేషనల్ హైవే ఉంది! కాబట్టి దయచేసి ఇప్పుడైనా ప్రభుత్వ పెద్దలు మా మునుగోడు నియోజకవర్గాన్ని యుద్ధ ప్రాతిపదికంగా డెవలప్ చేయవలసిందిగా కోరారు.

## మిషన్ భగీరథ లీకేజీలను పరిశీలించిన అధికారి ఏఈ రజిత



ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 24 : ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామశాఖ ఆధ్వర్యంలో గురువారం నాడు ఇబ్రహీంపట్నం మిషన్ భగీరథ ఎఈ రజిత ఫీల్డ్ మీదికి వచ్చి గ్రామంలో మిషన్ భగీరథ లీకేజీలను గురువారం పరిశీలించడం జరిగింది. లీకేజీ నీటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఆమెఅన్నారు. అదేవిధంగా గ్రామంలో ఉన్నటువంటి పాఠశాల విద్యార్థుల కోసం మేటీల మాదాపూర్ నుండి విద్యార్థులు బస్సు సౌకర్యం లేక నడుచుకుంటూ రావడం జరుగుతుంది. ఈ విషయం గమనించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి ఇబ్రహీంపట్నం డిఎంతో మాట్లాడడం జరిగింది. డిపో మేనేజర్ వెంటనే స్పందించి రెండు రోజుల్లో బస్సు వచ్చేటట్టు ఏర్పాటు చేస్తానని తెలుపగా బస్సు ఏర్పాటు చేస్తున్నందుకు ఇబ్రహీంపట్నం డిఎం కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సి.ఎమ్. రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### - బీమనపల్లి సైదులు



**చండూర్ అక్టోబర్ 24 (శాసనసభ న్యూస్) :** మునుగోడు (దుబ్బకాల్వ ) లో మన ప్రియతమా నాయకులు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సాకారంతో మంజూరు అయినా మునుగోడు మండలం లోని దుబ్బాకాల్వ గ్రామానికి చెందిన సాధు ధనలక్ష్మి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మునుగోడు క్యాంప్ ఆఫీసులో అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీమనపల్లి సైదులు, దుబ్బాకాల్వ గ్రామ శాఖ అధ్యక్షులు దండు వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు బెల్లి పూర్ణ యాదవ్, దండు లింగస్వామి జమ్ముల రాందాసు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చైర్ పర్సన్



**చండూర్, అక్టోబర్ 24,(శాసన సభ న్యూస్ ) :** ఇబ్రహీంపట్నం లోని జంగా రెడ్డి ఫంక్షన్ హాల్ లో గురువారం లెంకలపల్లి గ్రామానికి చెందిన ఐత గోని వెంకటేష్ గౌడ్ కూతురు పెళ్లికి చండూర్ పురపాలక సంఘం చైర్ పర్సన్ తోకల చంద్ర కళ వెంకన్న హాజరై నూతన వధూవరులను అక్షింతలేసి ఆశీర్వదించారు. నకిరేకంటి రామలింగం తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



**చండూర్, అక్టోబర్ 24,(శాసన సభ ) :** విద్యార్థి దశ నుంచే చిన్నా రులకు చట్టాలపై అవగాహన అవసరమని చండూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ వెంకటయ్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఠాణా ఆవరణంలో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు.సి. ఐ చట్టాలపై, పోలీసులు విధుల గురించి అవగాహన కల్పించారు. లాకప్, హాండ్ క్యాప్స్ చూపించారు. కేసుల నమోదు, జీడీఎంట్రీ, ఎఫ్ ఆర్. ఐ తో పాటు క్రైం వివరాల గురించి వివరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. నేరం చేసిన వారు ఎంతటి వారైనా.. ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు చలో హైదరాబాద్

### - మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని, సీడీఎం ఏ కార్యాలయం వద్ద ధర్నాను విజయ వంతం చేయండి


**ఇబ్రహీంపట్నం,శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబరు 24 :** తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్( సిఐటియు) ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో అక్టోబర్ 25న చలో సి డి ఎం ఏ కార్యాలయం చలో హైదరాబాద్ కు వెళ్ళుటకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ ఆఫీస్ లో ఇన్వార్డ్ సెక్షన్ లో రాధ కు గురువారం వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు పెద్దగారి లక్ష్మయ్య. కప్పాటి రాజు పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో సుమారు 65,000 మంది కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ,ఎన్ఎంఆర్, డైలీ వైస్, ఫిక్స్డ్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్నారని ఈ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రెండవ పిఆర్సి లో కనీస వేతనం 26,000 ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పని పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందికి అందరిని పర్మినెంట్ చెయ్యాలని,కార్మికులు మరణిస్తే దహన సంస్కారాలకు మట్టి ఖర్చులకు 30000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 25న చలో హైదరాబాద్ కార్యక్రమానికి మున్సిపల్ కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు



. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటియు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్మికులు జగదీష్,ఎదుల్లా రవి,జంగయ్య, నర్సింహ్మా, సాయిలు, రవీందర్, ఇంద్ర, భార్గవి, కల్లమ్మ, సుగుణమ్మ, శోభా, జయమ్మ, సుజాత, లావణ్య, సుజాత,అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో కుల సంఘాల సమావేశం

### - వివిధ బిసి కుల సంఘాలకు చెందిన రాష్ట్ర అధ్యక్షులు హాజరు






**నెట్వర్క్ ఇంచార్జ్ శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 24 :** రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆధ్వర్యంలో బిసి కుల సంఘాలు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి ఆధ్వర్యంలో బిసి కమిషన్ కార్యాలయంలో గురువారం బీసీ కుల సంఘాల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బాలకృష్ణ నాయి, సగర సంఘం అధ్యక్షులు శేఖర్ సాగర్, గౌడ గీత సంఘాల అధ్యక్షులు ఆయిల్ ఎంకన్న, దుర్గయ్య గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్జర్ చర్ల శీను ముదిరాజ్, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వేముల వెంకటేష్,పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోళ్ల శ్రీనివాస్ విక్రమ్ గౌడ్, లింగం గౌడ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మని మంజరి, మహిళా అధ్యక్షురాలు సిద్ధాంతం శ్యామల, దాదాపు 30 బీసీ కుల సంఘాలు కమిషన్ ఎదుట తమ తమ కులాల గురించి వివరించడమైనది.

## రాష్టంలోనే సొంతంగా సీడ్ గార్డెన్: తుమ్మల

**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** రాష్ట్రంలో సొంతంగా సీడ్ గార్డెన్ను ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని, అందుకు ఎఫ్జీవీ కంపెనీ సహకారం కూడా కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మలేషియా పర్యటనలో ఉన్న మంత్రి గురువారం ఎఫ్జీవీ కంపెనీ నిర్వహిస్తున్న సీడ్ గార్డెన్, నర్సరీలతో పాటు అధునాతన పద్ధతుల్లో నిర్వహిస్తున్న విత్తన కేంద్రాన్ని సందర్శించి, ఆ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ఇప్పటికే ఎఫ్జీవీ కంపెనీ నుంచి తెలంగాణకు సీడ్ లింగ్స్ను తెప్పించామని, భవిష్యత్తులో రాష్ట్రంలోనే సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటు చేస్తామని, అందుకు సహకారం కావాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కంపెనీ ప్రతినిధులు సీడ్గార్డెన్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

